


RNI No. TEL/TEL/2018/76342

# లోకంతీరు

LOKAMTEERU TELUGU DAILY సామాజిక, రాజకీయ దిన పత్రిక

ప్రచురణ : నిజామాబాద్ శనివారం 13-04-2024 ఎడిటర్ : బ్యాగల్ శ్రీనివాస్ సంపుటి : 06 సంచిక : 100 పేజీలు : 4 వెల : రూ 2-00

## తాడ్వాయిలో తప్పిన రోడ్డు ప్రమాదం

ములుగు ,ములుగు జిల్లా తాడ్వాయి మండల కేంద్రంలో గురువారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం తప్పింది. తాడ్వాయి మండల కేంద్రంలోని పాత బస్టాండ్ సమీపంలో ఇసుక లోడుతో వెళుతున్న ఓ లారీ అదుపుతప్పి జాతీయ రహదారి మధ్యలో డివైడర్లను 500 మీటర్లు ఢీ కొట్టుకుంటూ మసీదు సమీపంలో రోడ్డు పక్కన పడిపోయింది. ఈ ప్రమాద సమయంలో రోడ్డుపై ఎదురుగా ఇతర వాహనాలు, ప్రజలు ఎవరు లేకపోవడంతో భారీ ప్రమాదం తప్పింది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## చొరబాటుదార్లకు స్వాగతం..అల్లరి మూకలకు ఆశ్రయం : కాంగ్రెస్ తీరుపై భగ్గుమన్న మోదీ



రాజస్థాన్‌లోని బార్మర్‌లో శుక్రవారం ఎన్నికల ప్రచార ర్యాలీ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ కాంగ్రెస్ పార్టీపై విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ చొరబాటుదార్లను స్వాగతించిందని, రాజస్థాన్‌లో రామనవమి ఊరేగింపుపై రాళ్లు విసిరిన అల్లరిమూకలకు ఆ పార్టీ ఆశ్రయం కల్పించిందని ఆరోపించారు. కాంగ్రెస్ మేనిఫెస్టో ముస్లిం లీగ్ ముద్రతో ముందుకొచ్చిందని మండిపడ్డారు.దేశ విభజనకు కారణమైన ముస్లిం లీగ్ ముద్ర కాంగ్రెస్ మేనిఫెస్టోపై ఉందని ఆరోపించారు. ఇండియా కూటమిలో మరో పార్టీ భారత అణ్వాయుధాలను తాము ధ్వంసం చేస్తామని మేనిఫెస్టోలో ప్రమాదకర డిక్లరేషన్‌ను పొందుపరిచిందని

ప్రధాని ఆందోళన వ్యక్తం చేశారు. మన పొరుగున రెండు దేశాలు అణ్వాయుధాలను సమీకరిస్తే మనం మాత్రం మన అణ్వాయుధాలను ధ్వంసం చేయాలా అని ప్రశ్నించారు.భారత్‌ను శక్తిహీనంగా తయారుచేయాలని కూటమి పార్టీలు కోరుకుంటున్నాయా అని ప్రధాని మోదీ నిలదీశారు. ఇక ఈ ర్యాలీలో రాజస్థాన్ సీఎం భజన్‌లాల్ శర్మ మాట్లాడుతూ రాష్ట్రంలో తాము అధికారంలోకి వచ్చిన 90 రోజుల్లో మేనిఫెస్టోలో 45 శాతం హామీలను నెరవేర్చామని చెప్పారు. రాజస్థాన్‌లో నీటి సమస్యను పరిష్కరించేందుకు చొరవ చూపిన ప్రధానికి కృతజ్ఞతలు తెలుపుతున్నానని అన్నారు.

## ఢిల్లీలో రాష్ట్రపతి పాలనకు కుట్ర

### ఢిల్లీ మంత్రి ఆతిశీ ఆందోళన

న్యూ,ఏప్రిల్12: ఆప్ నేతలు మరోసారి సంచలన ఆరోపణలకు తెరతీశారు. రానున్న రోజుల్లో దేశ రాజధానిలో రాష్ట్రపతి పాలన విధించేందుకు భాజపా యత్నిస్తోందని వ్యాఖ్యానించారు. అరవింద్ కేజ్రీవాల్ నేతృత్వంలోని ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు కుట్ర జరుగుతున్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసిందని ఢిల్లీ మంత్రి ఆతిశీ ఆందోళన వ్యక్తం చేశారు. ఎలాంటి ఆధారాలు లేకుండా కేజ్రీవాల్‌ను తప్పుడు కేసులో అరెస్టు చేశారు. ఎందుకంటే ఢిల్లీలో ఎన్నికైన ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు కుట్ర జరుగుతోంది. గతంలోని అనుభవాలు ఈ విషయాన్ని వెల్లడిస్తున్నాయి. పలు విభాగాల్లో ఖాళీలు ఉన్నప్పటికీ.. అధికారులను కేటాయించడం లేదు. ఎన్నికల తేదీలు ప్రకటించిన నాటి నుంచి అధికారులు సమావేశాలకు హాజరుకావడం మానేశారు. ఈ కుట్రలో భాగంగానే సీఎం వ్యక్తిగత కార్యదర్శి(పీఎస్)ని పదవి నుంచి తొలగించారని ఆమె మీడియాతో మాట్లాడారు. ఈ ఆరోపణలను భాజపా తిప్పికొట్టింది. 'ఆ పార్టీ ప్రతిరోజు కొన్ని అందమైన కథల్ని వండి వార్చుతుంది' అని ఎద్దేవా చేసింది. ఇదిలా ఉంటే.. మద్యం విధానానికి సంబంధించిన కేసులో అరెస్టయి జైల్లో ఉన్న ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌కు వరుసగా ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. అవినీతి ఆరోపణలు చేస్తూ ఒక మంత్రి రాజీనామా చేయగా.. సీఎం పీఎస్ వైభవ్ కుమార్‌ను విధుల నుంచి తొలగించారు. అతడి నియామక ప్రక్రియలో నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు ఢిల్లీ ప్రభుత్వ విజిలెన్స్ విభాగం ప్రకటించింది.

## భాజపాకి ఓటు అడిగే హక్కు లేదు

### ఈడీ, సీబీఐ దాడులు చేయిస్తున్నారు
### చేనేతలకు కేంద్ర ప్రభుత్వం మొండిచేయి
### 14న దీక్షకు దిగనున్న మంత్రి పొన్నం



హైదరాబాద్,ఏప్రిల్12 : రాష్ట్రంలో భాజపాకి ఓటు అడిగే హక్కు లేదని తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. రాష్ట్రానికి ఆ పార్టీ ఏం చేసిందని ప్రశ్నించారు. ఒక్క జాతీయ ప్రాజెక్టు అయినా ఇచ్చిందా అని నిలదీశారు. గాంధీభవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. భాజపాను వ్యతిరేకిస్తే.. ఈడీ, సీబీఐ దాడులు చేయిస్తున్నారని మండిపడ్డారు. చేనేతలకు కేంద్రంలోని భాజపా ప్రభుత్వం అన్యాయం చేసిందని, తెలంగాణ అమరవీరులను అవమానించిందని విమర్శించారు. భాజపా, భారాస కలిసి కాంగ్రెస్‌ను దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తున్నాయన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తామని పునరుద్ఘాటించారు. ఇదిలావుంటే మంత్రి పొన్నం ప్రభాకర్ దీక్షకు పూనుకున్నారు. ఏప్రిల్ 14న దీక్ష చేపట్టాలని నిర్ణయించారు. బీజేపీ, బీఆర్ఎస్ వైఫల్యాలపై పొన్నం దీక్ష చేయాలని నిర్ణయించారు. కరీంనగర్ కాంగ్రెస్ కార్యాలయంలో దీక్షకు దిగనున్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మీడియాతో మాట్లాడుతూ.. నిరుద్యోగ భృతి, డబుల్ బెడ్ రూం ఇచ్చిన వాళ్ళనే బీఆర్ఎస్ ఓట్లు అడగాలని అన్నారు. 'మాకు ఒక్క వేలు చూపిస్తే.. మేం నాలుగు వేళ్ళు చూపెడుతాం' అని అన్నారు. పదేండ్లు మంత్రిగా ఉన్న హరీష్ రావు బుద్ధి ఉండే మాట్లాడుతున్నాడా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ ఏర్పడడంపై మోదీ అవహేళన చేశారని.. తెలంగాణ అమరులను ప్రధాని తెలంగాణలో ఓట్లు అడగడానికి మోదీకి ఏం హక్కు ఎక్కడిదని ప్రశ్నించారు. 'తెలంగాణకు బీజేపీ చేసిందేంటి? కొత్త రాష్ట్రానికి పదేండ్లలో బీజేపీ ఇచ్చిందేంటి? దేశాన్ని అదాని, అంబానీకి అమ్మడం తప్పా మోదీ ఏం చేశారు? బీజేపీని వ్యతిరేకిస్తే ఈడీ, సీబీఐలతో ఇబ్బంది పెడుతున్నారు. రాముడి ఫోటో పక్కన మోదీ ఫోటో ఎలా పెడుతారు. అభివృద్ధి ఏం చేశారని అడిగితే అది పక్కన పెట్టి గాలి కబుర్లు, సొల్లు కబుర్లు చెబుతున్నారు' అంటూ విరుచుకుపడ్డారు. రాముడిని రాజకీయాల కోసం వాడుకోవడం తప్పన్నారు. సికింద్రాబాద్‌కు తెలంగాణ బీజేపీ అధినేత కిషన్ రెడ్డి ఏం చేశారని నిలదీశారు. చేనేత కార్మికులకు బీజేపీ అన్యాయం చేసిందని అన్నారు.ప్రకృతి వైపరీత్యాలకు నార్త్ ఇండియాలో ఎలా ఆదుకుంటున్నారో సౌత్ ఇండియాలో కూడా అలాగే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. 'మిషన్ కాకతీయ నీళ్ళు మొత్తం ఎటు పోయాయి? మేం తాగినమా, మీరు తాగారా?' అంటూ ప్రశ్నలు సంధించారు. గుర్తింపు కోసమే కొందరు బీజేపీ నాయకులు కాంగ్రెస్ మంత్రులపై ఆరోపణలు చేస్తున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

## పొరపాటున కూడా అలా చేయొద్దు.. లేదంటే నిలువునా మోస పోతాం

సిద్దిపేట : రాష్ట్రంలో మళ్లీ వచ్చేది బీఅర్ఎస్ ప్రభుత్వమే. మనం పదేళ్లు పాలించినం..వాళు వచ్చి నాలుగు నెలలు కాలేదు. ప్రభుత్వంపై అప్పుడే వ్యతిరేకత పెరిగింది. కాంగ్రెస్‌మీద కోపంతో బీజేపీకి ఓటేస్తే పెనం నుంచి పొయ్యిలో పడ్డట్టు అయితదని మాజీ మంత్రి హరీశ్ రావు హెచ్చరించారు. మెదక్ పార్లమెంట్ ఎన్నికలపై శుక్రవారం కొండ భూదేవి



గార్డెన్‌లో సిద్దిపేట పట్టణ బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో హరీశ్ రావు పాల్గొని మాట్లాడారు. సిద్దిపేటలో సగం కట్టిన వెటర్నరీ కాలేజీని రద్దు చేసి సీఎం రేవంత్ రెడ్డి కొడంగల్‌కు తరలించుకు పోయాడని ఆరోపించారు.వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అని గంభీర ఉపన్యాసాలు ఇచ్చారు. ఇప్పుడు సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు. రేవంత్ రెడ్డి దగ్గర సరుకు లేదు, పని లేదని విమర్శించారు. బీజేపీ పేదలకు, తెలంగాణకు వ్యతిరేక పార్టీ.సిలేరును లాక్కుని మనకు అన్యాయం చేసిన పార్టీ అని గుర్తు చేశారు. పదేళ్లలోబీజేపీ చేసిన ఒక్క మంచి పని ఉందా? అని సూటిగా ప్రశ్నించారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటే అని రేవంత్ రెడ్డి బురదజచల్లిండ్లు.. ఇప్పుడు మోదీని బడేమియా అంటుంటున్న దని మండిపడ్డారు. కాంగ్రెస్, బీజేపీ ఒక్కటై తెలంగాణలో బీఅర్ఎస్ లేకుండా చేయాలనే కుట్రలు పన్నుతున్నారని విమర్శించారు.ప్రత్యర్థుల తప్పుడు ప్రచారాలను సోషల్ మీడియా వేదికగా కార్యకర్తలు తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. బీజేపీని ఓడించే శక్తి బీఆర్ఎస్‌కే ఉందని ముస్లిం సోదరులు గుర్తించాలి. ఇచ్చిన హామీలు తప్పిన కాంగ్రెస్ మెడలు వంచాలంటే ఎంపీ ఎన్నికల్లో బీఅర్ఎస్ పార్టీని గెలిపించాలన్నారు.

## వరంగల్ ఎంపీ స్థానంపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కసరత్తు

సిద్దిపేట : వరంగల్ ఎంపీ స్థానంపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కసరత్తు చేస్తున్నారు. ఈ క్రమంలో ఎర్రవెల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో వరంగల్ జిల్లా నేతలతో కేసీఆర్ శుక్రవారం మధ్యాహ్నం సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఎర్రబెల్లి దయాకర్ రావు, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డితో పాటు పలువురు నేతలు హాజరయ్యారు. మాజీ డిప్యూటీ సీఎం తాటికొండ రాజయ్య కూడా హాజరయ్యారు. అసెంబ్లీ ఫలితాల తర్వాత బీఆర్ఎస్‌కు రాజయ్య రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. కేసీఆర్ పిలుపు మేరకు రాజయ్య వ్యవసాయ క్షేత్రానికి వెళ్లారు.



## ఎపి ఇంటర్ ఫలితాలు విడుదల

### ఫస్టియర్‌లో 67 శాతం..సెకండ్‌లో 78 శాతం ఉత్తీర్ణత
### 84 శాతం ఉత్తీర్ణతతో కృష్ణా జిల్లా మొదటి స్థానం
### 81శాతంతో గుంటూరు, 79శాతంతో ఎన్టీఆర్ జిల్లా
### ఫెయిలయిన వారికి మేలోనే సప్లిమెంటరీ పరీక్షలు
### అభ్యర్థులు ఎవరూ ఆందోళన చెందవద్దన్న బోర్డు కార్యదర్శి

అమరావతి,ఏప్రిల్12 : ఆంధ్రప్రదేశ్ ఇంటర్ ఫలితాలువిడుదలయ్యాయి. తాడేపల్లిలోని ఇంటర్మీడియట్ విద్యా కార్యాలయంలో ఇంటర్ బోర్డ్ కార్యదర్శి ఫలితాలను విడుదల చేశారు. ఇంటర్ ఫస్టియర్‌లో 67 శాతం మంది ఉత్తీర్ణులవగా, రెండో సంవత్సరంలో 78 శాతం ఉత్తీర్ణత నమోదయింది. మొదటి సంవత్సరం ఫలితాల్లో 84 శాతం ఉత్తీర్ణతతో కృష్ణా జిల్లా మొదటి స్థానంలో నిలువగా, 81 శాతంతో గుంటూరు, 79 శాతంతో ఎన్టీఆర్ జిల్లా మూడో స్థానంలో ఉంది. ఇక సెకండియర్ ఫలితాల్లో 90 శాతంతో కృష్ణా జిల్లా ప్రథమస్థానంలో ఉండగా, 87 శాతంతో గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాలకు ద్వితీయస్థానం, 84 శాతంతో విశాఖ జిల్లాకు తృతీయస్థానంలో నిలిచింది. ఇంటర్ పరీక్షలు మార్చి 1 నుంచి 20 వరకు జరిగిన విషయం తెలిసిందే. ప్రథమ సంవత్సరానికి సంబంధించి 5,17,617, ద్వితీయ సంవత్సరం 5,35,056 మంది పరీక్ష ఫీజు చెల్లించగా.. వీరిలో 9,99,698 మంది పరీక్షలకు హాజరయ్యారు. పరీక్షలు ముగిసిన 22 రోజుల వ్యవధిలోనే ఫలితాలను విడుదల చేశారు. ఫస్టియర్ ఫలితాల్లో 67 శాతం ఉత్తీర్ణత నమోదు కాగా.. సెకండియర్ ఫలితాల్లో 78 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఇంటర్ బోర్డు కార్యదర్శి సౌరభ్ గౌర్ తెలిపారు. ఇంటర్ ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ఆయన అభినందనలు తెలిపారు. ఫెయిల్ అయిన విద్యార్థులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. మేలోనే ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. మే 24 నుంచి జూన్ 1 వరకూ ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ఉంటాయని తెలిపారు. విద్యార్థులు రెగ్యులర్ లో పాస్ అయ్యారా.?, సప్లిమెంటరీలో పాస్ అయ్యారా.? వంటివి మార్కుల జాబితాలో ఏమీ వివరాలు ఉండవని.. విద్యార్థులు కంగారు పడాల్సిన అవసరం లేదని అన్నారు. ఫెయిల్ అయిన విద్యార్థులు క్షణికావేశానికి లోను కావద్దని అన్నారు. ఇంటర్ పేపర్ల మూల్యాంకనం పకడ్బందీగా నిర్వహించినట్లు అధికారులు స్పష్టం చేశారు. విద్యార్థులకు మార్కులపై ఏమైనా అనుమానాలు ఉంటే రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్ కు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఏప్రిల్ 18 నుంచి 24 వరకూ ఫీజు చెల్లించాలని సూచించారు. అనంతరం ఆ ప్రక్రియ ప్రారంభమవుతుందని చెప్పారు. అలాగే, సప్లిమెంటరీ, ఇంప్రూవ్ మెంట్ కోసం విద్యార్థులు ఈ నెల 18 నుంచి 24 వరకూ ఫీజు చెల్లించాలని వివరించారు. ఫీజు వివరాలు, పరీక్షల టైం టేబుల్ వివరాలు అన్నీ అధికారిక వెబ్ సైట్స్ లో అందుబాటులో ఉంచనున్నట్లు పేర్కొన్నారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం, ద్వితీయ సంవత్సరం పరీక్షలకు సంబంధించిన ఫలితాలను ఒకేసారి విడుదల చేశారు. రెగ్యులర్ విద్యార్థులతోపాటు ఒకేషనల్ కోర్సుల విద్యార్థులకు సంబంధించిన ఫలితాలను కూడా వెల్లడించారు. అధికారిక వెబ్‌సైట్‌లో ఫలితాలను తమ రోల్ నంబర్, పుట్టిన తేదీ వివరాలు నమోదుచేసి అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఫలితాలను తెలుసుకోవచ్చు. రికార్డుస్థాయిలో ఇంటర్ బోర్డు ఫలితాలు ప్రకటించడం విశేషం. ఫలితాల్లో ఎప్పటిలాగా కృష్ణా జిల్లా 84 శాతంతో ఫస్ట్ ప్లేస్ లో నిలిచింది. గుంటూరు జిల్లా 81 శాతం ఉత్తీర్ణతతో రెండో స్థానంలో, 79 శాతం ఉత్తీర్ణతతో ఎన్టీఆర్ జిల్లా మూడో స్థానంలో నిలిచాయి. ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా 1,559 సెంటర్లలో మార్చి 1 నుంచి 20 వరకు ఇంటర్ పరీక్షలు నిర్వహించిన సంగతి తెలిసిందే. మార్చి 1 నుంచి 19 వరకు మొదటి సంవత్సరం విద్యార్థులకు, మార్చి 2 నుంచి 20 వరకు రెండో సంవత్సరం విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు.

## కవితకు మరోమారు చుక్కెదురు

### సిబిఐ అరెస్టును సవాల్ చేస్తూ పిటిషన్
### తిరస్కరించిన రౌజ్ అవెన్యూ కోర్టు



న్యూఢిల్లీ,ఏప్రిల్12 : ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో కేసీఆర్ కుమార్తె, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు మరోసారి చుక్కెదురైంది. సీబీఐ తనను అరెస్టు చేయడాన్ని సవాలు చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌ను ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు తోసిపుచ్చింది. సీబీఐ తనను ప్రశ్నించడాన్ని సవాలు చేసిన పిటిషన్‌ను కూడా కోర్ట్ కొట్టివేసింది. ఇక సీబీఐ కస్టడీకి అప్పగించడానికి సంబంధించిన పిటిషన్‌పై తీర్పును కోర్ట్ రిజర్వ్ చేసింది. కాగా ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో ప్రశ్నించేందుకు కవితను కస్టడీకి ఇవ్వాలని సీబీఐ తరపు న్యాయవాదులు వాదించారు. మరోవైపు ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో కవిత పాత్రకు సంబంధించిన కీలక విషయాలను సీబీఐ బహిర్గతం చేసింది. కవితే రూ. 100 కోట్లు చెల్లించినట్లు సీబీఐ కస్టడీ రిపోర్ట్‌లో తెలిపింది. కవిత జాగృతి సంస్థకు శరత్ చంద్రారెడ్డి రూ.80 లక్షల ముడుపులు చెల్లించినట్లు పేర్కొంది. డబ్బుల కోసం శరత్ చంద్రారెడ్డిని కవిత బెదిరించారని పేర్కొంది. ల్యాండ్ డీల్ చేసుకోకపోతే తెలంగాణలో బిజినెస్ ఎలా చేస్తావో చూస్తానని శరత్ చంద్రారెడ్డిని కవిత బెదిరించినట్లు కస్టడీ రిపోర్ట్‌లో సీబీఐ అధికారులు పేర్కొన్నారు. అసలు భూమే లేకుండా వ్యవసాయ భూమి కొనుగోలు చేసినట్లు అగ్రిమెంట్లు, రిజిస్ట్రేషన్ పత్రాలు సృష్టించారంది. ఐదు రోజుల కస్టడీకి ఇవ్వాలన్న పిటిషన్ పై వాదనలు విన్న కోర్టు కాసేపట్లో తీర్పు వెల్లడించనుంది. జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న కవితను విచారించేందుకు సీబీఐకి అనుమతి ఇవ్వడాన్ని సవాల్ చేస్తూ ఆమె తరఫు లాయర్ విక్రమ్ చౌదరి ఈ నెల 6న కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సీబీఐ విచారణపై స్టేటస్ కో ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. సీబీఐ తమకు ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వలేదని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.

## ఫొటో జర్నలిస్టు నర్రా రాజేష్ కుటుంబానికి అండగా ఉంటాం : కె శ్రీనివాస్ రెడ్డి

హైదరాబాద్ : యువ ఫొటో జర్నలిస్ట్ నర్రా రాజేష్ ఆకస్మిక మరణం అత్యంత విషాదకరమని, అతని కుటుంబానికి తాము అండగా ఉంటామని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి భరోసా ఇచ్చారు. శుక్రవారం నాడు బషీర్‌బాగ్‌లోని సురవరం ప్రతాప్ రెడ్డి ఆడిటోరియంలో తెలంగాణ స్టేట్ ఫోటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాజేష్ సంస్మరణ సభ నిర్వహించారు. అసోసియేషన్ నుండి బాధిత కుటుంబానికి లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కే శ్రీనివాస్ రెడ్డి మాట్లాడారు.ఆయా పత్రికల్లో ఫోటో జర్నలిస్టుగా సేవలందించిన రాజేష్, ఎంతో బాధ్యతగా తన కర్తవ్యాన్ని నిర్వర్తించాడని ఆయన కొనియాడారు. మీడియాకు ఫొటో జర్నలిస్టులు కళ్ళు, చెవుల లాంటి వారన్నారు. పత్రికల్లో వార్తలకు సాక్ష్యంగా నిలిచేది ఫొటోలేనని, ఆ ఫొటోల కోసం ఫొటో జర్నలిస్టులు పడే తిప్పలు వర్ణనాతీతమని శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. పాత్రికేయ వృత్తి అభద్రతా, అత్యంత ప్రమాదకరమైనట్లు ప్రజాస్వామిక దేశాలకు ఐక్యరాజ్య సమితి ఎప్పుడో సూచించిందని ఆయన గుర్తుచేశారు. ఫొటో, వీడియో జర్నలిస్టుల ఆరోగ్య భద్రత పై మీడియా సంస్థల యాజమాన్యాలు దృష్టి సారించాలని ఆయన సూచించారు.తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె విరాహత్ అలీ మాట్లాడుతూ..నిర్వహిస్తున్న ఫొటో, వీడియో జర్నలిస్టుల జీవితాలు అంధకారంలో మగ్గుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. లాఠీలను, తూటాలను, కేసులను లెక్కజేయకుం డా ఫోటో జర్నలిస్టులు పోషించిన సాహసవంతమైన పాత్ర అభినంద నీయమన్నారు. ఫొటో, హక్కుల పరిరక్షణ కోసం తమ సంఘం నాటి నుండి నేటివరకు అహర్నిశలు కృషి చేస్తుందన్నారు. ఎప్పుడూ చిరునవ్వు లతో పలకరించే రాజేష్ ఆకస్మిక మృతి తమను ఎంతో కలచివేసిం దని, అతని కుటుంబానికి చేయూతనిస్తామని విరాహత్ అన్నారు.

# సంపాదకీయం

శనివారం 13-04-2024

## మళ్లీ తెరపైకి ఈవీఎంలు...

ఈవిఎంల వివాదం మరోసారి తెరపైకి వచ్చింది. దేశంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల ద్వారా పోలింగ్ ప్రక్రియ ప్రారంభమైన 1982 నుంచి వివాదాలు కొనసాగుతూనే వున్నాయి. తాజాగా సుప్రీం కోర్టు ఇచ్చిన నోటీసుపై మరోసారి ఈవిఎంల పని తీరుపై చర్చను లేవదీసింది. వచ్చే లోకసభ ఎన్నికలకు ముందే ఇవిఎంలకు అనుబంధంగా ఉన్న వివిప్యాట్‌ల స్లిప్‌లను కూడా సమాంతరంగా లెక్కించాలని సుప్రీం కోర్టు ఎన్నికల సంఘాన్ని, కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. మే నెలలో జరగబోయే విచారణకు ముందు ఇసి తన నిర్ణయాన్ని ప్రకటించాలని సుప్రీంకోర్టు ఏప్రిల్ 1న జారీ చేసిన నోటీసులో పేర్కొన్నది. అయితే ఇప్పటి దాకా కేంద్రం గాని, ఎన్నికల సంఘం గాని వివిప్యాట్‌లను కూడా ఇవిఎంలతో పాటు లెక్కిస్తామని ప్రకటించలేదు. దీనిపై కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ఆదేశానుసారమే ఎన్నికల సంఘం నడుచుకుంటున్నదని సుప్రీం కోర్టులో పిటిషన్ వేసిన పిటిషనర్ ఆరోపిస్తున్నారు. ఇప్పటి దాకా ఇవిఎంలో బ్లూ బటన్‌తో నొక్కిన ఓట్లను ఎలక్ట్రానిక్‌గా లెక్కిస్తున్నారు. ఇందులో పారదర్శకత, జవాబుదారీతనం లేదని పిటిషనర్‌తో పాటు పలు పార్టీలు ఆరోపిస్తున్నాయి. ఇవిఎంతో పాటు వివిప్యాట్‌లో సీల్డ్ బాక్స్‌లో పడిన అన్ని ఓట్లను ప్రత్యక్షంగా లెక్కించాలని సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలైంది. ఇప్పటి దాకా ఇవిఎంలో నమోదైన మొత్తం ఓట్లను కాకుండా ఒక్కో అసెంబ్లీ సెగ్మెంట్‌కు ర్యాండమ్‌గా 5 శాతం ఓట్లనే నేరుగా లెక్కిస్తున్నారు. ఈవిఎంలలో గోల్‌మాల్ జరిగే అవకాశముందని 21 రాజకీయ పార్టీలు వాదిస్తున్నాయి. ఇవిఎంలను హ్యాక్ చేసి తమకు అనుకూలంగా తీర్పును మలుచుకునే అవకాశాలు ఉన్నందున వివిప్యాట్‌లను కూడా లెక్కిస్తే అనుమానాలు తీరుతాయని పార్టీలు చాలా కాలం నుంచి డిమాండ్ చేస్తున్నాయి. కేరళలోని పరూర్ అనే ప్రాంతంలో తొలిసారిగా ఇవిఎం మిషన్ల ద్వారా ఓటింగ్ ప్రక్రియను కేంద్ర ఎన్నికల సంఘం ప్రవేశపెట్టింది. అంతకు ముందు బ్యాలెట్లతోనే ఎన్నికలు జరిగేవి. దీని వల్ల ఖర్చుతో పాటు కౌంటింగ్ కూడా కష్టతరమవుతుందని, దీనికి బదులు ఓటర్లకు సౌలభ్యం, ప్రభుత్వానికి తక్కువ వ్యయంతో పోలింగ్ ప్రక్రియను పూర్తి చేయవచ్చనే భావనతో ఎన్నికల సంఘం ఇవిఎంలను ప్రవేశపెట్టింది. అయితే బాగా అభివృద్ధి చెందిన అమెరికా, జర్మనీ లాంటి దేశాల్లోనే పూర్తి స్థాయిలో కాకుండా 70 శాతం దాకా బ్యాలట్లతోనే పోలింగ్‌ను నిర్వహిస్తున్నారు. మన దేశంలోనే ఇవిఎంలతో 100 శాతం పోలింగ్ జరుపుతున్నారని, వీటిని ఏదో ఒక దశలో మార్చే అవకాశముందని వివిధ రాజకీయ పక్షాలు ఆరోపిస్తున్నాయి. ఇవిఎం అంటే దీనికి ఒక కంట్రోల్ యూనిట్, బ్యాలటింగ్ యూనిట్, దానికి అనుబంధంగా వివిప్యాట్ ఉంటుంది. ఒక ఓటర్ పోలింగ్ బూత్‌లోకి వెళ్ళిన తర్వాత ఇవిఎంపై బ్లూ బటన్‌ను నొక్కి తనకు నచ్చిన అభ్యర్థికి, పార్టీకి ఓటు వేయవచ్చు. పక్కనే వివిప్యాట్‌లో ఓటర్‌కి తాను ఏ పార్టీకి, అభ్యర్థికి ఓటు వేశానో 7 సెకెన్ల పాటు దృశ్య రూపంలో కనిపిస్తుంది. ఆ తర్వాత ఆ వివిప్యాట్ స్లిప్ ఆటోమేటిక్‌గా ముద్రణ అయిన తర్వాత సీల్డ్ బాక్స్‌లోకి వెళుతుంది. అయితే ఇందులో పడిన అన్ని ఓట్లను ఎన్నికల సంఘం లెక్కించడం లేదు. ఇవిఎం బటన్ల ద్వారా నొక్కిన ఓట్లను లెక్కించి ర్యాండమ్‌గా ఓటర్ వేసిన ఓట్లు సరైనవా కాదా అని నిర్ధారించడానికి 5 శాతం మాత్రమే స్లిప్‌లను లెక్కిస్తున్నారు. ఈ యంత్రాలను ప్రభుత్వ రంగంలోని బిఇఎల్, ఇసిఐఎల్‌లు ఉత్పత్తి చేసి ఎన్నికల సంఘానికి సరఫరా చేస్తున్నాయి. విద్యుత్ అవసరం లేకుండా మారుమూల పల్లెల్లో కూడా బ్యాటరీతో నడిచే యంత్రాలలోని ఓట్లను తారుమారు చేస్తున్నారని, ముఖ్యంగా దేశంలో గడిచిన పదేళ్లుగా అధికారంలో ఉన్న బిజెపి సెలెక్టివ్‌గా ట్యాంపర్ చేస్తున్నదని సుప్రీం కోర్టులో దాఖలైన పిటిషన్‌లో పార్టీలు, కొందరు పిటిషనర్లు ఆరోపించారు. పూర్తి పారదర్శకతతో ఓటర్ తీర్పు తారుమారు కాకుండా ఉ స్లిప్‌లను కూడా లెక్కించి బేరీజు వేస్తే తీర్పులో గోల్‌మాల్ జరిగే అవకాశం లేదనే పిటిషన్‌పై సుప్రీం కోర్టు మొత్తం పిటిషన్ పూర్వాపరాలను విచారించిన తర్వాత వివిప్యాట్‌లను కూడా లెక్కించాల్సిందేనని ఆదేశాలు జారీ చేసింది. కేంద్ర ప్రభుత్వం, ఇసి సుప్రీం కోర్టు ఆదేశంపై తమ నిర్ణయం ఏమిటి అనేది తెలియజేయాలి. నిజానికి ఇవిఎంలలో గోల్‌మాల్ లేదనుకుంటే కేంద్రం వివిప్యాట్‌ల లెక్కింపునకు ఇసికి ఆదేశాలు ఇవ్వాలి. కాని ఆదేశాలు ఇసికి అందుతాయా లేదా ఇసి నిర్ణయం బయటికి వస్తుందా లేదా అనే సందేహాలు సర్వత్రా నెలకొన్నాయి. ఇవిఎంలను ప్రవేశపెట్టిన నాటి నుంచి ఏదో ఒక వివాదం చుట్టుముడుతూనే ఉన్నా కేంద్రం, ఎన్నికల సంఘం ఇవిఎంలతోనే ఎన్నికల ప్రక్రియను కొనసాగిస్తున్నారు.

# అదిలాబాద్ నుంచి టీచర్ల మధ్యే పోటీ

అదిలాబాద్, ఏప్రిల్ 12 ఆదిలాబాద్ లోక్ సభ బరిలో ఈసారి ముగ్గురు ఆదివాసీ అభ్యర్థుల మధ్య ఆసక్తికర పోరు నెలకొంది. ఎస్టీ రిజర్వ్ పార్లమెంటు నియోజక వర్గంలో ప్రధాన పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ లు ఈసారి ఆదివాసులకే అభ్యర్థిత్వాలు ఖరారు చేయడం ఒక ఎత్తైతే పోటీ చేస్తున్న ముగ్గురు అభ్యర్థులు ఉపాధ్యాయ వృత్తి నుంచి రాజకీయాల వైపు రావడం ఆసక్తికర పరిణామం. 2019 లోక్ సభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి సోయం బాపురావు, ప్రత్యర్థి మాజీ ఎంపీ బీఆర్ఎస్ అభ్యర్థి గోడం నగేష్ పై 58 వేల ఓట్ల మెజార్టీతో విజయం సాధించగా కాంగ్రెస్ అభ్యర్థి నరేష్ జాదవ్ మూడోస్థానంలో నిలిచారు. మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఈసారి కొత్తగా కాంగ్రెస్ అధికారంలోకి రావడం సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికలకు ముందుగానే సభల్లో ఇచ్చిన మాట ప్రకారం ఆదివాసీకే సీటు ఖరారు చేయడంతో ముగ్గురు ఆదివాసీ గోండు తెగకు చెందిన అభ్యర్థుల మధ్య పోటీ రసవత్తరంగా మారింది. ఆదిలాబాద్ సిట్టింగ్ ఎంపీ స్థానాన్ని చేజారనివ్వకుండా బీజేపీ గట్టి ప్రయత్నాలు చేస్తుంది. బీఆర్ఎస్ నుంచి వలస వచ్చిన మాజీ ఎంపీ గోడం నగేష్ కు టికెట్టు ఖరారు చేయడంతో పాటు ఆదివాసీల ఓట్లపైనే పూర్తిగా గురిపెట్టిన పార్టీ అధిష్టానం వ్యూహాత్మకంగా ఒక్కో పోలింగ్ బూత్ కు 370 ఓట్లు తగ్గకుండాప్రణాళికలు రచిస్తుంది. పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో 2111 పోలింగ్ బూత్ లు ఉండగా బోథ్, ఆసిఫాబాద్, ఖానాపూర్ మూడు ఎస్టీ నియోజక వర్గాల్లో పట్టుసాధించేందుకు ఇప్పటి నుంచే పార్టీ నేతలు పావులు కదుపుతున్నారు. మిగతా పార్టీల కంటే గోడం నగేష్(ప్రచారంలో ముందు వరుసలో ఉన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అనూహ్యంగా ఇదే నియోజక వర్గం నుంచి ముధోల్, నిర్మల్, ఆదిలాబాద్, సిర్పూర్ టి సెగ్మెంట్ల నుంచి బీజేపీ ఎమ్మెల్యేలు నలుగురు గెలుపొందడంతో విజయం ఖాయమనే ధీమావ్యక్తమవుతుంది. అయితే పార్టీ టికెట్టు దక్కక నైరాశ్యంలో ఉన్న ఎంపీ సోయం బాపురావుహైకమాండ్ నేతలతో టచ్ లోనే ఉన్నా పార్టీ ప్రచారానికి దూరంగా ఉంటున్నారు. గత పది రోజులుగా ఢిల్లీలోనే మకాం వేసిన సోయం బాపురావు ఆచితూచి వ్యవహరిస్తున్నట్లు తెలుస్తుంది. తనకు కేంద్రంలో నామినేటెడ్ పదవి ఇస్తానంటేనే గోడం నగేష్ తో కలిసి ప్రచారంలో పాల్గొంటానని తేల్చి చెప్పడం గమనార్హం. మాజీ ఎంపీ రమేశ్ రాథోడ్ కూడా పార్టీకి దూరంగానే ఉండటంతో లంబాడల ఓట్లు ఈసారి ఎటువైపు దారిమళ్లుతాయో అనే అనుమానం కలుగుతోంది. ఉపాధ్యాయ వృత్తికి రాజీనామా చేసి నేరుగా కాంగ్రెస్ లో చేరిన ఆత్రం సుగుణపై అందరి దృష్టి కేంద్రీకృతమై ఉంది. గతంలో ప్రగతి శీల ఉద్యమాల్లో, ఆదివాసీ ఉద్యమ కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషించిన ఆత్రం సుగుణకు ఆదివాసుల ఓట్లు దండిగా పడతాయని పార్టీ అధిష్టానం అంచనా వేస్తుంది. ఈ నియోజకవర్గం నుంచి గెలిచిన ఒకే ఒక కాంగ్రెస్ అభ్యర్థి వెడ్మబొజ్జు, జిల్లా ఇన్ ఛార్జ్ మంత్రి సీతక్క పట్టుబట్టి ఆత్రం సుగుణ అభ్యర్థిత్వాన్ని ఖరారు చేయించారు. రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి రావ డం సీఎం రేవంత్ రెడ్డి... ఇంద్రవెల్లి సభ విజయవంతం కావడం పార్టీలో ఉత్తేజాన్ని నింపింది. పైగా రాజకీయ ఉద్దండులైన మాజీ ఎమ్మెల్యేలు కోనేరు కోనప్ప, విఠల్ రెడ్డితోపాటు డీసీసీబీ ఛైర్మన్ అడ్డి బోజారెడ్డి, జడ్పీ ఛైర్మన్ కోనేరు కృష్ణారావుతో సహా ద్వితీయ శ్రేణి క్యాడర్ బీఆర్ఎస్ కు

గుడ్ బై చెప్పి కాంగ్రెస్ లో చేరడం ఆత్రం సుగుణకు కలిసొచ్చే అంశంగా భావిస్తున్నారు. తొలిసారిగా కాంగ్రెస్ మహిళా అభ్యర్థిని పోటీలో దించడంతో మహిళల ఓట్లు పడతాయని ఆ పార్టీ నేతలు నమ్ముతున్నారు. తొలిసారి లోక్ సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున పోటీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు వ్యూహాత్మకంగా ఆదివాసులు ఓట్లపైనే భారం వేసుకుని ప్రచారం ముమ్మరం చేశారు. బీఆర్ఎస్ పార్టీకి లంబాడాల మెజార్టీ ఓట్లు పడుతాయన్న ధీమాతో లంబాడ తండాల్లో ప్రచారం ముమ్మరం చేస్తూ మద్దతు కూడగట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. 2008లో కాంగ్రెస్ లో చేరిన ఆత్రం సక్కు అంతకు ముందు ఉపాధ్యాయుడిగానే పనిచేశారు. 2009 అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన సక్కు 2014లో ఓటమి చవిచూశారు. 2018లో కాంగ్రెస్ నుంచి గెలిచి తర్వాత బీఆర్ఎస్ లో చేరిన ఆత్రం సక్కు గిరిజనులు, గిరిజనేతరుల ఓట్లపై భారం వేసుకుని ప్రచారం ముమ్మరం చేస్తున్నారు. ముగ్గురు ఆదివాసీ అభ్యర్థుల మధ్య ఆసక్తికర పోరు నెలకొనగా, గెలుపు ఓటములను నిర్ణయించే గిరిజనేతరుల ఓట్లే ఇక్కడ కీలకంగా మారనున్నాయి. ఇదిలా ఉంటే ఆదిలాబాద్( నుంచి ప్రధాన పార్టీలు నుంచి పోటీ చేస్తున్న అభ్యర్థులు ఆదివాసీలు కావడంతో మరోవైపు గిరిజనేతర్ల ఓట్లు గెలుపోటములపై కీలక ప్రభావం చూపనున్నాయి. గతంలో ఆదివాసులకు లంబాడీలకు అనేక పోరాటాలు జరిగాయి. ఈ సందర్భంలో లంబాడ ఓట్లు ఆదివాసులకు ఏ విధంగా అనుకూలిస్తాయో వేచి చూడాలి

# సికింద్రాబాద్ పై కాంగ్రెస్ గురి

## రంగంలోకి కోమటిరెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 12 ( న్యూస్ పల్స్) సికింద్రాబాద్ లోక్ సభ స్థానంపై అధికార కాంగ్రెస్ పార్టీ ఫోకస్ పెట్టింది. గతంలో చేజార్చుకున్న ఈ స్థానాన్ని ఈసారి ఎలాగైనా దక్కించుకునేందుకు పావులు కదుపుతోంది. ఇప్పటికే ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ను పార్టీలో చేర్చుకుని, సికింద్రాబాద్ఎంపీ అభ్యర్థిగా ప్రకటించింది. మరోవైపు లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి కాంగ్రెస్ పార్టీ బాధ్యతలు అప్పగించింది. ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సికింద్రాబాద్ లోక్సభ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్చార్జి లతో సమావేశమై దిశా నిర్దేశం చేశారు. లో గెలుపే లక్ష్యంగా పని చేయాలని కాంగ్రెస్ నేతలకు రేవంత్ సూచించారు. ఇప్పటికే మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కూడా తన నివాసంలో అసెంబ్లీ ఇన్చార్జిలతో, అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులతో సమావేశం నిర్వహించారు. మరోవైపు కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ స్థాయి సమావేశాలకు సిద్ధమవుతుంది. ఈరోజు నాంపల్లిలో తొలి అసెంబ్లీ స్థాయికి సన్నాహక సమావేశం జరుగనుంది. సికింద్రాబాద్ లోక్ సభ పరిధిలో కాంగ్రెస్ పార్టీకి కనీస ప్రాతినిధ్యం లేకున్నా, పట్టు కోసం తీవ్రంగా ప్రయత్నిస్తోంది. అందులో భాగంగానే ఆపరేషన్ ఆకర్ష్ కు శ్రీకారం చుట్టింది. ఇటీవలే జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ విజయం సాధించినా.....గ్రేటర్ లో ఒకటైన సికింద్రాబాద్ లో సభ పరిధిలోనీ ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో ఒక్క సీటు కూడా దక్కించుకోలేక పోయింది. ఏడు స్థానాలకు గాను బిఆర్ఎస్ పార్టీ 6 స్థానాలు కైవసం చేసుకోగా....ఒక స్థానంలో మజ్లిస్ పార్టీ గెలుపొందింది. కొన్ని స్థానాల్లో మాత్రం కాంగ్రెస్ పార్టీ డిపాజిట్లు కూడా కోల్పోయింది. దీంతో గ్రేటర్‌లో ఓటమిని తీవ్రంగా పరగణించిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే.....గ్రేటర్ హైదరాబాద్ రాజకీయాల పై ప్రత్యేక దృష్టి సారించింది. అందులో భాగంగానే బిఆర్ఎస్ ఎమ్మెల్యే దానం నాగేందర్,మేయర్ విజయలక్ష్మి, మాజీ మేయర్ రామ్మోహన్,మాజీ డిప్యూటీ మేయర్ బాబా ఫాసియుద్దిన్ మరియు కొందరు కార్పొరేటర్లును కాంగ్రెస్ పార్టీలో చేర్చుకొని....పకడ్బందీ వ్యూహంతో ముందుకు సాగుతుంది. అయితే సికింద్రాబాద్ లోక్ సభ సీటును పలువురు నేతలు ఆశించినా..... చివరికి ఆ సీటు దానం నాగేందర్ కే దక్కింది. ఇదిలా ఉంటే సికింద్రాబాద్ స్థానంలో గెలుపే లక్ష్యంగా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి రంగాల్లో దిగారు. ఇన్‌ఛార్జిగా నియామకం కాగానే తన నివాసం లోక్సభ అభ్యర్థి దానం నాగేందర్ తో పాటు గత అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులతో మంత్రి సమావేశమయ్యారు. సికింద్రబాద్ లోక్ సభ పరిధిలో జరుగుతున్న రాజకీయ పరిణామాల గురించి మంత్రి కోమటిరెడ్డి తెలుసుకున్నారు. పార్టీలో కొత్తగా చేరిన వారితో పాటు అధికారంలో ఉన్న కారణంగా పరిస్థితులు తమకు అనుకూలంగా మారే అవకాశాలు ఉన్నాయని కాంగ్రెస్ పార్టీ భావిస్తుంది. ఇటు బిఆర్ఎస్ పార్టీ సైతం సికింద్రాబాద్ లోక్ సభ్ స్థానంపై గెలుపే లక్ష్యంగా సమావేశాలు నిర్వహిస్తుంది. ఇప్పటికే ఆ పార్టీ అభ్యర్థిగా ప్రకటించిన....పద్మ రావు అధ్యక్షతన సమావేశాలు జరుగుతున్నాయి. సనత్ నగర్ ఎమ్మెల్యే,మాజీ మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్ నివాసంలో శనివారం పార్లమెంట్ సన్నాహక సమావేశం నిర్వహించారు. కార్పొరేటర్లు,పార్టీ సీనియర్లు మరియు పార్టీ కార్యకర్తలతో అయన సమావేశం నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై అయన సమావేశం నిర్వహించారు. ఇటు సికింద్రాబాద్ సిట్టింగ్ ఎంపిగా కొనసాగుతున్న కిషన్ రెడ్డి సైతం మరోసారి గెలుపు కోసం తీవ్రంగా కృషి చేస్తున్నారు. ఏది ఏమైనప్పటికీ ఈసారి గెలుపు ఎవరిని వరిస్తుందో వేచి చూడాలి.

# ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన మహనీయుడు స్వర్గీయ దుద్దిళ్ల శ్రీపాదరావు

-ప్రజాభిమానాన్ని చూరగొన్న మహానేత

-నేడు ఆయన జయంతి

ప్రజాభిమానాన్ని చూరగొన్న మహానేత,ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన మహనీయుడు స్వర్గీయ దుద్దిళ్ల శ్రీపాదరావు.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ మాజీ స్పీకర్ స్వర్గీయ దుద్దిల్ల శ్రీపాదరావు కరీంనగర్ ఉమ్మడి జిల్లాకు చెందిన ప్రముఖ రాజకీయ నాయకుడు. ఈయన మార్చి 2, 1935న అప్పటి కరీంనగర్ జిల్లా మంథని నియోజకవర్గంలోని కాటారం మండలం ధన్వాడ గ్రామంలో (ప్రస్తుతం భూపాలపల్లి జిల్లా) జన్మించారు. న్యాయవిద్య అభ్యసించిన శ్రీపాదరావు ప్రారంభంలో పంచాయతి కార్యాలయంలో క్రిందిస్థాయి ఉద్యోగిగా జీవనం ఆరంభించి, రాజకీయాలలో ప్రవేశించి సర్పంచిగా, సమితి అధ్యక్షుడిగా, భూ తనఖా బ్యాంకు ఛైర్మెన్‌గా, మూడుసార్లు మంథని శాసనసభ్యుడిగా, శాసనసభ స్పీకరుగా అంచెలంచెలుగా ఎదిగారు. 1935 సంవత్సరములో మార్చి 2 న కాటారం మండల ధన్వాడ గ్రామానికి చెందినా మౌళి పటేల్ రాధాకిష్టయ్య, కమలా బాయి దంపతులకు జన్మించాడు. అమ్మమ్మ వారు నివాసముండే నాగపూర్ లో పుట్టిన అయన ప్రాథమికవిద్య ధన్వాడ గ్రామంలో చేసి, ఎస్ ఎస్ సి వరకు మంథనిలోని బావ సువర్ణ చంటయ్య ఇంట్లో ఉండి పూర్తిచేశాడు. ఇంటర్, డిగ్రీ హైదరాబాద్ లో చేసిన తరువాత ఆదిలాబాద్ జిల్లాలో పంచాయతి ఇన్స్పెక్టర్ గా ఉద్యోగం కొన్ని రోజులు చేశారు. ఆ తరువాత నాగపూర్ లో న్యాయవాదిగా ప్రజలకు సేవ చేయాలనే తలంపుతో ఎల్. ఎల్. బి. పూర్తి చేసి ప్రాక్టీసు పెట్టారు. తండ్రి మరణాంతరం స్వంత ఊరికి వచ్చిన శ్రీపాద వ్యవసాయమే వృత్తిగా చేసుకొని, గ్రామంలోనే ఉన్నాడు. కొన్ని రోజుల తరువాత స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామం నుండి సర్పంచ్ గా పోటీ చేయాలని ప్రజలు ఒత్తిడిచేశారు. నాయకత్వ లక్షణాలు పుణికి పుచ్చుకున్న శ్రీపాద రాజకీయాల్లోకి అడుగిడాలని స్నేహితులు, హితులు ప్రోత్సాహించారు. ఆ దిశగా అడుగులు వేస్తూ పోటి చేసి మొదటిసారి సర్పంచ్ గా ఎన్నుకోబడ్డారు. వరుసగా మరో మారు ఆయనకే ప్రజలు మద్దతు పలకడంతో రెండవ సారి ఎన్నికయ్యారు. మహాదేవపూర్ సమితి అధ్యక్షునిగా ఎన్నికైన తరువాత ఎల్ ఎం బి ఛైర్మన్ పదవికి మంథని నుండి గెలిచాడు. ఆయన రాజకీయ ఎదుగుదలకు ఎల్ ఎం బి బ్యాంకు ఛైర్మన్ ఎన్నిక ఎంతో సహకరించింది. దీంతో పూర్తిగా నియోజకవర్గానికే ఆయన సుపరిచితమైనాడు. పదవివస్తే ముఖంచాటు చేసుకునే నాయకులకు భిన్నంగా అయన ప్రజల మధ్యనే ఉంటూ, వారి కష్ట, నష్టాలలో పాలు పంచుకొని ప్రజానాయకునిగా ఎదిగాడు. 1984 ఎన్నికల్లో ఆయనకు కాంగ్రెస్ పార్టీ నుండి ఏమ్మేల్లెగా పోటి చేసే అవకాశం లభించింది. అప్పుడే పురుడు పోసుకున్న తెలుగు దేశం పార్టీ ప్రభావం, ఎన్టిఆర్ ప్రభంజనం ముందు శ్రీపాదరావు విజయం సాదించగలుగుతాడా అనే అంశం పై స్వపార్టీ, విపక్షాలలో చర్చ జరిగింది. తెలుగుదేశం, సంజయ్ విచార మంచ్ మధ్య ఎన్నికల ఒప్పందం కారణంగా మంథని శాసనసభ నియోజకవర్గం నుండి పోటిగా విచార మంచ్ నుండి చంద్రుపట్ల రాజి రెడ్డి దిగారు. వీరిద్దరి మధ్య గట్టి పోటి నెలకొనగా చివరకు శ్రీపాదరావు విజయం సాధించారు. ఆ తరువాత జరిగిన ఎన్నికల్లో మూడు సార్లు శాసన సభ్యులుగాఎన్నికైన ఆయనకు శాసనసభ స్పీకర్ గా అన్ని పార్టీల మద్దతుతో పదవి నదిష్టించారు. ఆ పదివికి వన్నె తెచ్చారని ఎంతోమంది ప్రముఖులు, రాజకీయా విశ్లేసకులతో ప్రశంశలు పొందారు. ఒకవైపు స్పీకర్ పదవి బాధ్యతతో నిర్వహిస్తునే మరోవైపు తన స్వంత నియోజకవర్గ ప్రజలను మాత్రం మరిచిపోకుండా, మరింత దగ్గరయ్యారు. విమర్శలకు వెరవకుండా, పొగడ్తలను లెక్క చేయకుండా, అభివ్రుదిపై దృష్టి సారిస్తూ ముందుకు కదిలారు. 1994 ఎన్నికల ముందు నక్సల్స్, పోలీసుల మధ్య జరిగిన ప్రత్యేక్ష పోరు తీవ్రంగా ప్రభావం చూపింది. తీవ్రఉద్రిక్త పరిస్థితుల్లో ఎన్నికలు ముగిశాయి. ఈ ఎన్నికల్లో శ్రీపాదరావు పరాజయం పాలయ్యాడు. అయిన ఓటమి పాలయిన ప్రజలకు మాత్రం దూరం కాలేదు. వారి మధ్య లోనే ఉంటూ వారికి తన శక్తి మేరకు సేవ చేస్తూనే ఉంటూ వచ్చాడు. పాలకపక్షం, ప్రాతినిధ్యం వహిస్తున్న అప్పటి శాసన సభ్యులు రామ్ రెడ్డి పై కనీసం పల్లెత్తు మాట, విమర్శ కూడా చేయకుండా హుందాగా వ్యవహరించి, తన ప్రజాభిమాన్ని మరింత చూరగొన్నారు

# బారాముల్లా లోక్‌సభ స్థానం నుంచి ఒమర్ అబ్దుల్లా పోటీ



శ్రీనగర్: జమ్ముకశ్మీర్ మాజీ సీఎం ఒమర్ అబ్దుల్లా బారాముల్లా లోక్‌సభ నియోజకవర్గం నుంచి ఎన్నికల్లో పోటీ చేయనున్నారు. నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్సీ) అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా ఈ మేరకు శుక్రవారం ప్రకటించారు. పార్టీకి కంచుకోటగా ఉన్న సెంట్రల్ కశ్మీర్‌లోని శ్రీనగర్ నియోజకవర్గం నుంచి ప్రముఖ షియా నాయకుడు అగా సయ్యద్ రుహుల్లా మెహదీ పోటీ చేస్తారని తెలిపారు. కాగా, లోక్‌సభ ఎన్నికల్లో బారాముల్లా స్థానం నుంచి పోటీ చేస్తున్నట్లు ఒమర్ అబ్దుల్లా స్పష్టం చేశారు. ఉత్తర కశ్మీర్‌పై బీజేపీ ఎక్కువగా దృష్టి సారించిందని తెలిపారు. అందుకే తాను ఇక్కడ పోటీ చేయాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు. 'ఉత్తర కశ్మీర్‌లో ఈ శక్తులు ఓడిపోవాలని నేను కోరుకుంటున్నా' అన్ని అన్నారు. మరోవైపు లోక్‌సభ ఎన్నికల్లో తన పోరాటం ఒక వ్యక్తిపై కాదని ఒమర్ అబ్దుల్లా తెలిపారు. బీజేపీ కుట్రలు, ద్రోహం, రాజకీయ కుతంత్రాలకు వ్యతిరేకంగా అని అన్నారు. ఎన్సీ ఉపాధ్యక్షుడైన ఒమర్ అబ్దుల్లా 2009 తర్వాత తొలిసారి లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. జమ్ముకశ్మీర్‌కు తిరిగి రాష్ట్ర హోదా దక్కే వరకు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయబోనని ఆర్టికల్ 370 రద్దు తర్వాత ఆయన ప్రమాణం చేశారు.

# వరంగల్ బీఆర్ఎస్ అభ్యర్థిగా రాజయ్య!

## ఫాంహౌజ్‌లో కేసీఆర్‌తో భేటీ



,హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల్లో వరంగల్ నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య అభ్యర్థిత్వం దాదాపు ఖరారైంది. ఈ మేరకు రాజయ్య పేరును కేసీఆర్ కాసేపట్లో అధికారికంగా ప్రకటించనున్నట్లు సమాచారం. వరంగల్ అభ్యర్థిని నిర్ణయించేందుకు జిల్లా నేతలతో కేసీఆర్ ఎర్రవెల్లిలోని ఫాంహౌజ్‌లో శుక్రవారం(ఏప్రిల్ 12) భేటీ అయ్యారు. ఈ భేటీకి రాజయ్యకు కూడా పిలుపు అందడంతో వరంగల్ నుంచి ఆయన పోటీ చేయడం ఖాయమన్న ప్రచారం ఊపందుకుంది. వరంగల్ నుంచి ఇప్పటికే బీఆర్ఎస్ అభ్యర్థిగా ప్రకటించిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి కూతురు కడియ్యం కావ్య కాంగ్రెస్‌లోకి వెళ్లడంతో బీఆర్ఎస్ తాజాగా మళ్లీ అభ్యర్థిని ప్రకటించాల్సిన పరిస్థితి ఏర్పడింది. గతేడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తన సిట్టింగ్ సీటు స్టేషన్‌ఘన్‌పూర్ టికెట్‌ను కడియం శ్రీహరికి ఇచ్చారని అలకబూనిన రాజయ్య ఎన్నిలు పూర్తయి ఫలితాలు వచ్చిన తర్వాత బీఆర్ఎస్‌కు రాజీనామా చేశారు. తాజాగా కడియం శ్రీహరి, ఆయన కూతురు కావ్యతో కలిసి కాంగ్రెస్‌కు వెళ్లడంతో రాజయ్య తిరిగి బీఆర్ఎస్‌లోకి వచ్చేందుకు ఓకే అన్నట్లు సమాచారం. కాగా, ప్రస్తుతం వరంగల్ నియోజకవర్గంలో విచిత్ర పరిస్థితి నెలకొంది. బీఆర్ఎస్‌కు ప్రత్యర్థులుగా ఉన్న రెండు ప్రధాన పార్టీల నుంచి పోటీ చేస్తున్న అభ్యర్థులిద్దరూ బీఆర్ఎస్‌ను ఇటీవల వీడి టికెట్ తీసుకున్న వారే కావడం గమనార్హం. దీంతో బీఆర్ఎస్‌కు తమ పార్టీ నుంచి వెళ్లిన వారిపైనే పోరాడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇక్కడ బీజేపీ నుంచి వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్, కాంగ్రెస్ నుంచి కడియం కావ్య బరిలో ఉన్నారు.

# బెంగళూరు కేఫ్‌లో పేలుడు కేసు.. ఎన్ఐఏ అదుపులో ఇద్దరు కీలక నిందితులు

బెంగళూరు రామేశ్వరం కేఫ్ పేలుడు కేసులో మరో ఇద్దరు కీలక నిందితులను జాతీయ దర్యాప్తు సంస్థ తాజాగా అరెస్ట్ చేసింది. బెంగాల్‌కు చెందిన ముసావీర్ షాజీబ్ హుస్సేన్, అబ్దుల్ మాథీన్ అహ్మద్ తాహాను శుక్రవారం అదుపులోకి తీసుకున్నట్లు ఎన్ఐఏ వర్గాలు వెల్లడించాయి. పేలుడుకు పాల్పడిన వారిలో ఈ ఇద్దరు ప్రధాన కుట్రదారుల్లో ఒకరుగా ఎన్ఐఏ అధికారులు ఇప్పటికే గుర్తించారు. పలు కేసుల్లో నిందితులుగా ఉన్న వీరిద్దరి ఆచూకీ కనిపెట్టేందుకు ఎన్ఐఏ బృందాలు దేశవ్యాప్తంగా తీవ్రంగా గాలిస్తున్నాయి. ఈ క్రమంలోనే వీరి ఆచూకీ కోసం ఎన్ఐఏ రూ.20 లక్షల నగదు బహుమతిని కూడా ప్రకటించింది. ప్రధాన నిందితులైన ముసావీర్ షాజీబ్ హుస్సేన్, అబ్దుల్ మాథీన్ అమ్మద్ తాహాల సమాచారం తెలిపితే ఒక్కొక్కరిపై రూ.10లక్షల వంతున రూ.20 లక్షలను బహుమతిగా ఇవ్వనున్నట్లు తెలిపింది. కేఫ్‌లో ముసావీర్ హుస్సేన్ షాజీబ్ ఐఈడీని అమర్చాడని పేర్కొంది. వీరి సమాచారం తెలిసిన వారు 080-29510900 ఫోన్ నంబర్‌కు కానీ,ఈ-మెయిల్‌కు సమాచారం ఇవ్వాలని కోరింది. బెంగళూరులోని ప్రముఖ రెస్టారెంట్ రామేశ్వరం కేఫ్‌లో మార్చి 1 శుక్రవారం బాంబ్ బ్లాస్ట్ ఘటన చోటుచేసుకున్న విషయం తెలిసిందే. ఈ పేలుడులో మొత్తం 10 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనలో మాస్క్, క్యాప్ ధరించిన ఓ వ్యక్తి బస్సులో ప్రయాణించి కేఫ్‌కు వచ్చినట్లు గుర్తించారు. కేఫ్‌లో పేలుడు జరిగిన గంట తర్వాత అనుమానితుడు బస్సు ఎక్కినట్లు సీసీటీవీ ఫుటేజీలో రికార్డైంది. ఈ కేసులో ఇప్పటికే పలువురు అనుమానితులను ఎన్ఐఏ అధికారులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.



## హనుమకొండలో దారుణం.. మహిళ కాళ్లపై నుంచి వెళ్లిన ఆర్టీసీ బస్సు




వరంగల్ : హనుమకొండ జిల్లాలో దారుణం చోటు చేసుకుంది. ఓ మహిళ కాళ్లపై నుంచి ఆర్టీసీ బస్సు దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో మహిళ రెండు కాళ్లు విరిగిపోయాయిఈ విషాదకర సంఘటన శుక్రవారం హనుమకొండ బస్టాండ్‌లో చోటు చేసుకుంది. ప్రమాదానికి గురైన మహిళ హనుమకొండ జిల్లా శాయంపేట మండలం పత్తిపాకకు చెందిన కావటి రాజక్క (48)గా గుర్తించారు.గుర్తించిన స్థానికులు వెంటనే ఆమెను దవాఖానకు తరలించి పోలీసులకు సమాచారమిచ్చారు. సంఘటన స్థలానికి చేరుకున్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## ఆ ఇద్దరిని మడత పెట్టి కొట్టిన ఘనత కేసీఆర్‌ది




సూర్యాపేట : కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యాలపై సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్ రెడ్డినిప్పులు చెరిగారు. కండ్ల ముందే నీళ్లు పోతున్నా ఇవ్వలేని రండలు కాంగ్రెస్‌వాళ్లు అని ఘాటుగా విమర్శించారు. శుక్రవారం కోదాడలో నిర్వహించిన బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. నాడు చంద్రబాబు, వైఎస్ఆర్ హయాంలోనూ నోరు మూసుకున్న రండలు మీరేనని ఆరోపించారు.ఆరోగ్యం బాగాలేకున్నా రైతుల కోసం తిరుగుతున్న పోరాటయోధుడు కేసీఆర్ అని ప్రశంసించారు. జేబులో కతెర పెట్టుకునే వాడు జేబు దొంగనే అవుతాడన్నారు. మంది లాగులు ఊడగొట్టి ఏమి చూస్తావు రేవంత్ రెడ్డి అని ఎద్దేవా చేశారు. సీఎం అయింది దీని కోసమేనా అని మండిపడ్డారు. కేసులు పెడితే ఏమవుతుంది. బీఆర్ఎస్ పార్టీ లేకుండా చేస్తామని బీరాలు పలుతుకుతున్నారు.నీవల్ల కాదన్నారు. చంద్రబాబు, వైఎస్‌ను ఇద్దరిని మడత పెట్టి కొట్టిన ఘనత కేసీఆర్‌ది అని గుర్తు చేశారు. నువ్వు జేబు దొంగ కావొచ్చు మొదలు.. ఇపుడు సీఎం అని గుర్తు పెట్టుకో అని హితవు పలికారు. రేవంత్ లాగానే మంత్రి ఉత్తమ్ కూడా ఉత్తర కుమార ప్రగల్భాలు పలుకుతున్నాడు. డిసెంబర్ 9 నుంచి ఇస్తానన్న ఆరు గ్యారంటీలు ఎటు పోయాయని ప్రశ్నించారు.మాట ఇచ్చి మోసం చేసిన కాంగ్రెస్ పార్టీని బొంద పెట్టాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కెసిఆర్ ఎప్పుడైనా చేయగలిగిందే చెప్పాడు. చేపిందే అమలు చేసి చూపించారన్నారు. అక్రమ కేసులతో బీఆర్ఎస్ కార్యకర్తలను వేదిస్తే ఊరుకోమన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.

## ఎన్నికల్లో పేదరికం, నిరుద్యోగమే కీలకాంశాలు : తేజస్వి యాదవ్

బిహార్ మాజీ డిప్యూటీ సీఎం, ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ బీజేపీ లక్ష్యంగా విమర్శలు గుప్పించారు. రానున్న లోక్‌సభ ఎన్నికల సందర్భంగా పేదరికం, నిరుద్యోగం వంటి కీలకాంశాలపై చర్చ జరగాలని అన్నారు.మోదీ సర్కార్ పదేండ్ల కాలంలో యువతకు ఎన్ని ఉద్యోగాలు కల్పించారని ప్రశ్నించారు. దేశంలో పేదరికాన్ని ప్రధాని మోదీ ఎందుకు నిర్మూలించలేదని నిలదీశారు. బిహార్‌కు ప్రత్యేక హోదా ఎందుకు ఇవ్వలేదని పాలక బీజేపీని తేజస్వి యాదవ్ ప్రశ్నించారు. ఆకలి,




నిరుద్యోగం, ధరల మంట సామాన్యుడిని సతమతం చేస్తున్నాయని, దీనిపై కాషాయ పాలకులు నోరు మెదపడం లేదని మండిపడ్డారు. యువతకు ఉపాధి కల్పించడంలో మోదీ సర్కార్ విఫలమైందని ఆరోపించారు.

## రాబోయే ఎన్నికల వ్యూహంపై చర్చ

**సీట్ల సర్దుబాట్లపైనా ఎన్‌డిఎ నేతల దృష్టి**

**చంద్రబాబు నివాలసంలో నేతల భేటీ**

అమరావతి,ఏప్రిల్12(: రాబోయే ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించేందుకు ఎన్‌డిఎ నేతలు భేటీ అయ్యారు. ఉండవల్లిలోటీడీపీ అధినేత చంద్రబాబు నిసవాంలో ఎన్డీయే నేతలు భేటీ అయ్యారు.బీజేపీ రాష్ట్ర ఇన్‌ఛార్జి సిద్దార్థ నాథ్ సింగ్, పార్టీకి చెందిన ఇతర నేతలు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఈ భేటీలో పాల్గొన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఈ భేటీ ప్రాధాన్యతను సంతరించు కుంది. ఈ భేటీలో రాష్ట్ర వ్యాప్తంగా కొన్ని సీట్లలో అభ్యర్థుల మార్పుపై చర్చించే అవకాశం ఉంది. ముఖ్యంగా తూర్పుగోదావరి జిల్లా అనపర్తిలో బీజేపీకి బదులుగా టీడీపీ పోటీ చేసే అంశంపై చర్చించ నున్నారు. నుంచి బీజేపీకి ఛాన్స్ ఇవ్వాలని యోచిస్తున్నారు. మరికొన్ని నియోజకవర్గాలపై కూడా చర్చలు జరపనున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో మూడు పార్టీల మధ్య సమన్వయం అంశం కూడా చర్చకు వచ్చే అవకాశం ఉంది.

# ఏపిలో కూటమికి అసమ్మతి తలనొప్పి

**టిక్కెట్ దక్కని వారు అసమ్మతి రాగం**

**నేతలను బుజ్జగిస్తూ సాగుతున్న ప్రచారం**

విజయవాడ,ఏప్రిల్12: ఏపీలో నామినేషన్ గడువు దగ్గర పడుతోంది. కూటమి నేతల్లో ఆగ్రహ జ్వాలలు ఇంకా చల్లారలేదు. అసంతృప్తులను చల్లార్చేందుకు కూటమి నేతలు ఉమ్మడిగా ప్రచారం మొదలెట్టినా.. ఎక్కడో ఓ దగ్గర లుకలుకలు తప్పడం లేదు. కొన్నిచోట్ల టికెట్ దక్కలేదని, మరోచోట రెబల్ అభ్యర్థులు బరిలో ఉండటంతో కేడర్ అయోమయంలో ఉంది. ఏపీలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి పొత్తు, సీట్ల సర్దుబాటు, అభ్యర్థుల ప్రకటన మొదలు.. ఇప్పటివరకూ పలు నియోజకవర్గాల్లో అసమ్మతి పూర్తిగా చల్లారలేదు. కొన్నిచోట్ల కేడర్ పెద్దయెత్తున నిరసనలు, రాజీనామాల నేపథ్యంలో ఒకరిద్దరు అభ్యర్థులను మార్చింది టీడీపీ అధిష్ఠానం. జనసేనలోనూ కొన్ని నియోజకవర్గాల్లో టికెట్ దక్కక నిరసనలు వ్యక్తమయ్యాయి. ఇప్పటి వరకు కూటమిలో రెబల్స్ బెడద, అసంతృప్త జ్వాలలు ఇంకా చల్లారలేదు. ఐతే త్వరలో ఇవన్నీ సమసిపోతాయని కూటమి నేతలు చెబుతున్నారు.ఈ అసంతృప్తులను చల్లార్చేందుకు ఉభయగోదావరిజిల్లాలో కూటమి ఉమ్మడిగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తోంది. అసంతృప్తనేతలతో మాట్లాడి బుజ్జగించే ప్రయత్నం చేస్తోంది. కడపజిల్లా రాజంపేట అసెంబ్లీ నియోజకవర్గంలో వింత పరిస్థితి నెలకొంది. చంద్రబాబు ప్రకటించిన అభ్యర్థిని తానేనంటూ టీడీపీ నేత బాల సుబ్రహ్మణ్యం ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. మరోవైపు టీడీపీ నేత చెంగల్రాయుడు కూడా ఇంటింటి తిరిగి ప్రచారం చేస్తున్నారు. అభ్యర్థిపై చంద్రబాబు పునరాలోచన చేస్తారని చెబుతున్నారు. దాంతో ఇద్దరు నేతల ప్రచారంతో తెలుగు తమ్ముళ్లలో అయోమయం నెలకొంది. తూర్పు గోదావరిజిల్లా అనపర్తిలో బీజేపీ అభ్యర్థి, మాజీ సైనికుడు శివరామకృష్ణంరాజు బిక్కవోలు లక్ష్మి గణపతి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి ఎన్నికల ప్రచారం మొదలు పెట్టారు. అయితే శివరామకృష్ణం రాజు ప్రచారాన్ని టీడీపీ శ్రేణులు అడ్డుకున్నాయి. ఎన్నికల నామినేషన్ పత్రాలు దాఖలు చేసేవరకూ టీడీపీ కండువా మెడలో వేసుకోవద్దంటూ వాగ్వాదానికి దిగారు. దాంతో కండువా తీసేసి ప్రచారం చేశారాయన. మరోవైపు తనకే టికెట్ కేటాయిస్తారంటున్నారు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి. అయితే అభ్యర్థి ఎవరైనా వైసీపీని ఓడించడమే లక్ష్యమని బీజేపీ నేత శివరామకృష్ణం రాజు అన్నారు. నెల్లూరుజిల్లా కావలిలోనూ రెబల్ రాజకీయం హీటెక్కింది. టీడీపీ టికెట్ కోసం ప్రయత్నించి భంగపడ్డ పసుపులేటి సుధాకర్.. స్వతంత్రంగా బరిలో దిగాలని డిసైడయ్యారు. టికెట్ విషయంలో టీడీపీ తనను మోసం చేసిందని.. తానూ గెలిస్తే సొంత నిధులతో కావలిని అభివృద్ధి చేస్తానన్నారు సుధాకర్. పశ్చిమ గోదావరిజిల్లా తణుకులో జనసేనకు విడివాడ రామచంద్రరావు ఝలక్ ఇచ్చారు.

టికెట్ దక్కకపోవడంతో తీవ్ర అసంతృప్తిలో ఉన్న ఆయనతో పార్టీ నేతలు చర్చలు జరిపినా టీడీపీ అభ్యర్థి రాధాకృష్ణతో కలిసి పనిచేయటానికి ముందుకురాలేదు. పవన్ తణుకు పర్యటనలో ప్లే కార్డులు పట్టుకుని నిరసన చేశారు విడివాడ అనుచరులు. గెలిచే టికెట్స్ త్యాగం చేస్తారా? వారాహియాత్రలో ఇచ్చిన మాట ఎందుకు నిలబెట్టుకోలేదంటూ ప్లే కార్డులను ప్రదర్శించారు. ఇక ఇలాంటి అసమ్మతుల జాబితాలో గతంలో వైసీపీ నుంచి టీడీపీలోకి వచ్చిన మహిళా

నాయకురాలు గిడ్డి ఈశ్వరి కూడా ఉన్నారు. 2019లో టీడీపీ తరఫున ఓడిపోయినప్పటికీ ఆ పార్టీనే నమ్ముకుని ఈ ఐదేళ్లు పనిచేశారు. అయితే అనూహ్య పరిణామాల మధ్య ఉపాధ్యాయ వృత్తి నుంచి రిటైర్ అయిన కిల్లు వెంకట రమేష్ నాయుడుకి టికెట్ కేటాయించింది తెలుగుదేశం. ఈ నేపథ్యంలోనే ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తానని ప్రకటించారు గిడ్డి ఈశ్వరి. బుధవారం కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో బహిరంగంగానే ప్రకటించారు. తాను స్వతంత్ర అభ్యర్థిగా నిలబడి పాడేరును చంద్రబాబుకు గిఫ్ట్ గా ఇస్తానన్నారు.

# పెద్దపల్లి బీజేపీ క్యాండెట్ ఛేంజ్..?

కరీంనగర్, ఏప్రిల్ 12, తెలంగాణలో 17 లోక్‌సభ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించి ప్రచారం మొదలు పెట్టిన బీజేపీ ఈసారి 10 నుంచి 12 స్థానాల్లో గెలుపే లక్ష్యంగా ప్రచారం మొదలు పెట్టింది. అభ్యర్థులు తమ నియోజకవర్గాల్లో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఏప్రిల్ 20 తర్వాత జాతీయ నాయకులు కూడా ప్రచారానికి వచ్చేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు కమలనాథులు. ఈ తరుణంలో బీజేపీ టికెట్లు ప్రకటించిన అభ్యర్థుల్లో కోవర్ట్‌ను గుర్తించింది. ఎంతో నమ్మకంతో పార్టీ టికెట్ ఇస్తే.. ప్రచారం చేయకుండా మిన్నకున్న అభ్యర్థిని మార్చాలని బీజేపీ అధిష్టానం భావిస్తోంది.పెద్దపల్లి లోక్‌సభ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థిగా ఇటీవలే కాంగ్రెస్ నుంచి బీజేపీలో చేరిన గోమాస శ్రీనివాస్‌ను ప్రకటించింది. తెలంగాణ రాష్ట్ర సమితిలో రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన గోమాస శ్రీనివాస్ తర్వాత టీడీపీలో, బీఎస్పీలో పనిచేశారు. మొన్నటి వరకు కాంగ్రెస్‌లో ఉన్నారు. కాంగ్రెస్ ఎంపీ టికెట్ గడ్డం వంశీకి ఇస్తుందని తెలియడంతో బీజేపీలో చేరారు. వెంటనే బీజేపీ అధిష్టానం కూడా నమ్మకంతో టికెట్ ఇచ్చింది.బీజేపీ టికెట్ ప్రకటించి దాదాపు 20 రోజులు దాటింది. చాలా మంది టికెట్ ప్రకటించక ముందునుంచే తమ నియోజకవర్గాల్లో ప్రచారం మొదలు పెట్టారు. అయితే పెద్దపల్లి అభ్యర్థి గోమాస శ్రీనివాస్ మాత్రం టికెట్ ఇచ్చినా పెద్దగా ప్రచారం చేయడం లేదు. మొక్కుబడిగా చిన్నచిన్న సమావేశాలకే పరిమితమవుతున్నారు. దీంతో బీజేపీ అధిష్టానం గోమాస తీరుపై దృష్టిపెట్టింది.గోమాస శ్రీనివాస్ 2009 నుంచి ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. 2009లో టీఆర్ఎస్ టికెట్‌పై పెద్దపల్లి ఎంపీగా పోటీ చేసి ఓడిపోయారు. తర్వాత 2014లో టీడీపీ టికెట్‌పై పోటీ చేశారు. తర్వాత కాంగ్రెస్‌లో చేరారు. చెన్నూర్ ఎమ్మెల్యేగా కూడా పోటీచేశారు. అయితే ఆయన ఎన్నికల్లో ప్యాకేజీ కోసమే పోటీ చేస్తారన్న ఆరోపణలు ఉన్నాయి. పార్టీల నుంచి టికెట్ తెచ్చుకుని తర్వాత ప్రత్యర్థుల నుంచి ప్యాకేజీ తీసుకుంటారని గతంలో ఆరోపణలు వచ్చాయి. గతంలో బీజేపీ ఎమ్మెల్యే టికెట్ ఇవ్వగా, ఆయన గడ్డం

వివేక్ నుంచి ప్యాకేజీ తీసుకుని ఆయన గెలుపునకు సహకరించినట్లు ప్రచారం జరిగింది. ఇందుకు కాలు జారి పడినట్లు సాకు చూపారని సమాచారం. ఈ నేపథ్యంలో ఆయన బ్యాక్‌గ్రౌండ్ తెలుసుకోకుండా హడావుడిగా ఎంపీ టికెట్ ఇచ్చిన బీజేపీ ఇప్పుడు పునరాలోచనలో పడింది.గోమాస తీరుపై అనుమానంతో ఉన్న బీజేపీ ఇప్పుడు మరో అభ్యర్థి కోసం వేట సాగిస్తోంది. ఈ క్రమంలో బీఆర్ఎస్ నుంచి ఇటీవలే కాంగ్రెస్‌లో చేరిన సిట్టింగ్ ఎంపీ వెంకటేశ్ నేత కాషాయ నేతలకు టచ్‌లోకి వెళ్లినట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ టికెట్ వస్తుందన్న ఆశతో బీఆర్ఎస్ నుంచి హస్తం తీర్థం పుచ్చుకున్న వెంకటేశ్ నేతకు కాంగ్రెస్ పార్టీ హ్యాండ్ ఇచ్చింది. దీంతో ఆయన పార్టీతో అంటీ ముట?టనట్లు ఉంటున్నారు. ఈ క్రమంలో బీజేపీతో టచ్‌లోకి వెళ్లారు. కమలం నేతలు కూడా అభ?యర్థిని మార్చే ఆలోచనలో ఉండడంతో వెంకటేశ్ నేతను పార్టీలో చేర్చుకుని టికెట్ ఇవ్వాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈమేరకు చకచకా మార్పులు జరుగుతున్నట్లు సమాచారం

# సిక్సర్ అంటున్న కాంగ్రెస్

**రామరాజ్యమంటున్న బీజేపీ**

**కరువు అస్త్రంతో గులాబీ**

హైదరాబాద్, ఏప్రిల్ 12 వచ్చే నెలలో జరగనున్న లోక్ సభ ఎన్నికలకు ఒక్కో పార్టీ ఒక్కో ప్రచార అస్త్రాన్ని ఎంచుకుంటుంది.ఎవరి అస్త్రాలతో వారు సరికొత్త వ్యూహాలను రచిసస్తూ ముందుకు వెళుతున్నారు.ఇందిరమ్మ రాజ్యం,రామరాజ్యం వంటి నినాదాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ గా మారుతున్నాయి.రాష్ట్రంలోని మొత్తం 17 స్థానాలు ఉండగా.....ఇటు కాంగ్రెస్ అటు బీజేపీ డజన్ కు పైగా సీట్లను కైవసం చేసుకుంటామని బలంగా చెబుతూంటే....ఇటీవలే జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలైన గులాబీ పార్టీ మాత్రం గతంలో ఇచ్చిన " సారు.....కారు...పదహారు " వంటి నినాదాలను ఈసారి పక్కన పెట్టిందనే చెప్పాలి.రాష్ట్రంలోని ప్రధాన పార్టీల ఎజెండాలను ఒకసారి పరిశీలిస్తే.....ఆరు గ్యారెంటీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ....ఇప్పటికే అమలు చేసిన పలు గ్యారెంటీ లను ప్రజల్లో బలంగా ప్రచారం చేసుకుంటుంది.ఆర్టీసీ బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణం,రూ.500 లకే గ్యాస్ సిలిండర్,200 యూనిట్ల ఉచిత విద్యుత్,ఆరోగ్యశ్రీ భీమా పెంపు,ఇందిరమ్మ ఇండ్లు....వంటి పథకాలను కాంగ్రెస్ పార్టీ ప్రజల్లోకి తీసుకెళ్తుంది. రానున్న రోజుల్లో పంటల భీమా,రైతు భరోసా, వరికి బొనస్, పెన్షన్లు తదితర హామీలను రానున్న రోజుల్లో అమలు చేయనున్నట్లు కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతుంది.ఇదిలా ఉంటే రాష్ట్రంలోని ఓటర్లలో సగం జనాభా ఉన్న మహిళా ఓటర్లపై కాంగ్రెస్ స్పెషల్ ఫోకస్ పెట్టింది.కాగా రాష్ట్రంలోని పలు పార్లమెంట్ నియోజకవర్గాల్లో పురుష ఓటర్లతో పోల్చితే మహిళా ఓటర్లె ఎక్కువగా ఉన్నారు. అలాంటి స్థానాలలో కాంగ్రెస్ ఎక్కువ శ్రద్ధ పెడుతుంది.ఇటు అసెంబ్లీ ఎన్నికల్లో మహిళా ఓటర్ల ఆధిపత్యం ఉన్న సెగ్మెంట్ల పై కూడా కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక దృష్టి పెట్టింది.ప్రభుత్వం మహాలక్ష్మి పథకం కింద అమలు చేస్తున్న గ్యారెంటీలను మహిళా ఓటర్లకు బలంగా ప్రచారం చేసుకుంటుంది.ఇటీవలే తుక్కుగూడ లో జరిగిన జన జాతర సభలో కూడా పెద్ద సంఖ్యలో మహిళలను పార్టీ సమీకరించింది.అధికారంలోకి వచ్చిన తరువాత కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల తో పాటు గత ప్రభుత్వ హయంలో జరిగిన వైఫల్యాలను కూడా కాంగ్రెస్ బలంగా ప్రచారం చేస్తుంది. మేడిగడ్డ బ్యారేజ్ డ్యామేజ్,కాళేశ్వరం ప్రాజెక్ట్ లో అవినీతి,ఫోన్ ట్యాపింగ్ ,గొర్రెల స్కాం, ఆవుల స్కాం....ఇలా అనేక వైఫల్యాలను ఎత్తిచూపుతూ....ఆ పార్టీనీ మరింత బలహీన పరిచేందుకు ఆ పార్టీ నేతలను వరుసగా కాంగ్రెస్ లో చేర్చుకుంది.ఆ పార్టీ నుంచి వచ్చే వలస నేతలకు పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం ఇచ్చి ముల్లును ముల్లుతోనే తీసే వ్యూహానికి కాంగ్రెస్ తెర లేపుతుంది.ఎన్నికల ప్రచార తీవ్ర రూపం తీసుకునే సమయానికి గులాబీ పార్టీని మరింత వీక్ చేసేందుకు బిఆర్ఎస్ ను ఉచ్చులో బిగించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటోంది.పదేళ్లు పాలించి హ్యాట్రిక్ విజయం సాధించాలి అనుకున్న బిఆర్ఎస్ పార్టీకి ప్రజలు బ్రేక్ ఇచ్చారు.దీంతో ప్రతిపక్ష హోదాలోకి వెళ్లిపోయిన గులాబీ పార్టీ కాంగ్రెస్ నాలుగు నెలల పాలనలో రైతులకు కష్టాలు మొదలు అయ్యాయని,రాష్ట్రంలో త్రాగు నీటి,సాగు నీటి కరువు ఏర్పడిందని,కరెంటు కోతలు మొదలు అయ్యాయని.....ప్రజలు ఇబ్బంది పడుతున్నారని కాంగ్రెస్ పార్టీ పై విమర్శలు గుప్పిస్తూ ఈ అంశాలనే ఎన్నికల ప్రచారానికి వాడుకుంటుంది.పదేళ్లల్లో లేని కరువు కాంగ్రెస్ ఏర్పడిన నాలుగు నెలలో వచ్చిందని దానికి కాంగ్రెస్ అసమర్ధత, చేతే గాని పాలనే కారణమని,ఈ కారును ప్రకృతి తెచ్చిన కరువు కాదని కాంగ్రెస్ తెచ్చిన కరువని గులాబీ పార్టీ ఆరోపిస్తోంది.మరోవైపు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పొలం బాట పట్టారు. ప్రతిపక్ష నేత హోదాలో పొలం బాట పట్టి రైతులతో ముచ్చటించి వారికి ధైర్యం ఇస్తున్నారు.సాగునీటి సరఫరా చేయకపోవడం తో రైతులకు జరిగిన నష్టానికి పరిహారం చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కేసీఆర్ డిమాండ్ చేశారు. నాలుగు నెలలోనే 200 మందికి పైగా రైతులు మరణించారని.....ఆ కుటుంబాలకు ప్రభుత్వం ఆదుకోవాలని కూడా అయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.అయితే కేసిఆర్ చెబుతున్న మాటలను మాత్రం అధికార కాంగ్రెస్,బీజేపీ పార్టీలు తిప్పి కొడుతున్నాయి.రైతుల గురించి మాట్లాడే నైతిక అర్హత కూడా కేసిఆర్ కు లేదని పదాల్లో వేల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటే కనీసం ఒక్క కుటుంబాన్ని కూడా కేసిఆర్ ప్రభుత్వం ఆదుకోలేదని,లక్షల్లో ఎకరాల్లో పంట నష్టం జరిగితే ఎంత మంది రైతులకు నష్ట పరిహారం చెల్లించారు అంటూ బీజేపీ,కాంగ్రెస్ పార్టీలు మండిపడుతున్నాయి.నష్టపోయిన రైతులను తప్పకుండా ఆదుకుంటామని సిఎం రేవంత్ రెడ్డి భరోసా ఇచ్చారు.అసెంబ్లీ ఎన్నికల్లో అన్యూహంగా 8 మంది ఎమ్మెల్యేలను గెలుచుకున్న బీజేపీ పార్టీ గత బిఆర్ఎస్ వైఫల్యాలను వివరిస్తూనే......వంద రోజుల కాంగ్రెస్ పాలనపై విమర్శలు గుప్పిస్తూ ఉంది.డబుల్ ఇంజన్ సర్కార్ తోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమని,రామరాజ్యం తోనే తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందనే నినాదాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్తుతుంది.వీటితో పాటు ప్రధాని మోడీ ఇమేజ్,అయోధ్య శ్రీరాముడి ప్రణ ప్రతిష్ఠ,రాష్ట్రానికి పసుపు బోర్డు,గిరిజన యూనివర్సిటీ,ఎస్సీ వర్గీకరణకు హామీ తదితర అంశాలను బీజేపీ ప్రస్థావిస్తుంది.ప్రపంచ వ్యాప్తంగా ప్రధాని మోడీకి ఉన్న ఇమేజ్ ను వాడుకొని రాష్ట్రంలో అత్యధిక సభలు పెట్టాలని బీజేపీ నాయకత్వం ఆలోచిస్తుంది.

## బీఆర్ఎస్ నుంచి డబ్బులు తీసుకున్నట్టు నిరూపిస్తే దేనికైనా రెడీ: కడియం



జనగామ: ఎవరు ఎన్ని కుట్రలు, కుయుక్తులు చేసినా వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి కావ్య విజయం సాధిస్తుందని ఎమ్మెల్యే కడియం శ్రీహరి చెప్పారు.తమకు బీఆర్ఎస్ పార్టీ డబ్బులు ఇచ్చినట్టు నిరూపిస్తే తాము ఎన్నికల్లో పోటీ నుంచి తప్పుకుంటామని సవాల్ విసిరారు.కాగా, కడియం స్టేషన్ ఘన్‌పూర్‌లో శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ నుంచి మేము రూ.10కోట్లు తీసుకున్నామని సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఇది నిజమని ఎలాంటి ఆధారాలు చూపించినా, నిరూపించినా మేము ఎన్నికల్లో పోటీ నుంచి తప్పుకుంటాము. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా కావ్య గెలుపు ఖాయమైంది. సీఎం రేవంత్ ఆశీర్వాదంతో నేను వరంగల్‌ను అభివృద్ధి చేస్తాను.బీజేపీ వాళ్ళు రాజ్యాంగం మీద అవగాహన లేక మిడిమిడి జ్ఞానంతో మాట్లాడుతున్నారు. చేసిన పని చెప్పడానికి ఏమీ లేక వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారు. నా కూతురు కావ్య ఇక్కడే పుట్టింది, ఇక్కడే కడియం ఫౌండేషన్ అనేక సేవా కార్యక్రమలు చేసింది. 2017లో ఐదుగురు జడ్జిల ధర్మసానం భారతదేశంలో మతం మారినంత మాత్రాన కులం మారదు అని తెలిపింది. పిల్లలకు తండ్రి కులం వర్తిస్తుంది. కావాలని ప్రజలను తప్పుదోవ పట్టించడానికి ఇలాంటి వ్యాఖ్యలు చేయడాన్ని ఖండిస్తున్నాను. నా 30ఏళ్ల రాజకీయ జీవితం తెరిచిన పుస్తకం. నా నిజాయితే నాకు పెట్టుబడి.నేను ఏ పార్టీకి వెన్ను పోటు పొడవలేదు. కానీ నా ద్వారా ఎదిగిన ఆరూరి రమేష్ నాకు వెన్నుపోటు పొడిచాడు. నేను ఛాలెంజ్ చేస్తున్న నీదగ్గర ఏమైనా డబ్బులు తీసుకున్నానా చెప్పాలి. 2014, 2018లో నీ గెలుపు కోసం నేను ప్రచారం చేసాను. నువ్వు చేసిన భూకబ్జాల కారణంగా ఓడిపోయావు. ఓటమి భయంతో ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారు. మందకృష్ణ నాపై వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారు. ఒక్క నాపై మాత్రమే ఎందుకు విమర్శలు చేస్తున్నావు. నాది మాదిగ ఉప కులం. మాదిగలకు ద్రోహం చేస్తున్నది మందకృష్ణ. బీజేపీ మళ్ళీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మారుస్తాం అంటున్నా పార్టీకి ఓటు వేయమని ఎలా చెపుతున్నావు. దీనికి సమాధానం చెప్పాలి. నీ నాయకత్వం సరిగా లేకపోవడం వల్లనే ఎంఆర్‌పీఎస్‌లో చీలికలు వచ్చాయి అంటూ విమర్శలు చేశారు.

## అభద్రతా భావంలో అధికార కాంగ్రెస్

**ఇచ్చిన హామీలపై ప్రజల్లో వ్యతిరేకత**

**బిజెపి ఎంపి లక్ష్మణ్ విమర్శలు**

హైదరాబాద్,ఏప్రిల్12: అధికార కాంగ్రెస్ పార్టీ అభద్రతా భావంలో ఉందని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ అన్నారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలపై ప్రజల నుంచి వ్యతిరేకత పెరుగుతోందన్నారు. కరువు, నీళ్లు అందక పంటలు ఎండిపోతున్నాయని తెలిపారు. సానుభూతి కోసం తనపై కుట్రలు జరుగురున్నాయని.. రేవంత్ రెడ్డి కొత్త నినాదం ఎత్తుకున్నారని మండిపడ్డారు. మజ్లిస్‌ను గెలిపించమని రేవంత్ రెడ్డి చెప్పారని కాంగ్రెస్ నాయకులే బాహాటంగా చెబుతున్నారన్నారు. మజ్లీస్‌కు సపోర్ట్ చెయ్యడం హనుమంతరావు లాంటి వ్యక్తులకు ఇష్టం లేదన్నారు. సొంత నేతల వలనే కాంగ్రెస్ ప్రభుత్వం పడిపోతుందంటూ వ్యాఖ్యలు చేశారు. అవినీతి పార్టీలకు కొమ్ము కాసే వ్యక్తులు జైళ్లలో ఉన్నారన్నారు. హామీల విషయంలో బీఆర్ఎస్‌కు పట్టిన గతే కాంగ్రెస్‌కు పడుతుందని హెచ్చరించారు. అబద్దాలకు కాంగ్రెస్, అహంకారనికి బీఆర్ఎస్‌లు మారుపేరు అంటూ విమర్శలు గుప్పించారు. తనపై, తన ప్రభుత్వంపై కుట్ర జరుగుతుందని ప్రజలను మభ్య పెడుతున్నారన్నారు. రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి అవుతారని కాంగ్రెస్ రిఫరెండంగా ప్రకటిస్తారా..! అని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ ప్రశ్నించారు.

## భద్రాచలంలో శ్రీరామ నవమి ఏర్పాట్లు

**ఆన్‌లైన్‌లో రూమ్స్ బుకింగ్ షురూ**

భద్రాచలం,ఏప్రిల్12: ప్రతి ఏటా అంగరంగ వైభవంగా నిర్వహించే రాములోరి బ్రహ్మోత్సవాలు మళ్లీ మొదలయ్యాయి. భద్రాచలంలోని రాములోరి ఆలయంలో శ్రీరామనవమి తిరు కల్యాణ బ్రహ్మోత్సవాలు ఏప్రిల్ 9 నుంచి ప్రారంభమయ్యాయి. ఇవి ఏప్రిల్ 23 వరకు కొనసాగనున్నాయి. ఈ క్రమంలో భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో జరిగే శ్రీరామనవమి, మహా పట్టాభిషేక ఉత్సవాలకు హాజరయ్యే భక్తులు ఆన్‌లైన్(నీన్గి÷తిని।)లో కూడా గదులు బుక్ చేసుకోవచ్చనిఅధికారులు ప్రకటించారు. ఈ క్రమంలోనే ఏప్రిల్ 17న శ్రీరామనవమివేడుక జరగనుంది. ఈ నేపథ్యంలో లక్షలాది మంది భక్తులు ఈ వేడుకల కోసం తరలిరానున్నాయి. ఇప్పటికే భక్తుల కోసం చలువ పందిళ్లను ఏర్పాటు చేశారు. దీంతోపాటు ఆలయ పరిసరాలలో తాగు నీరు సహా భక్తుల కోసం గదులనుకూడా సిద్ధం చేశారు.భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో జరిగే శ్రీరామనవమి, మహా పట్టాభిషేక ఉత్సవాలకు హాజరయ్యే భక్తులు ఆన్‌లైన్‌లో కూడా గదులు బుక్ చేసుకోవచ్చని అధికారులు ప్రకటించారు. . ఏప్రిల్ 17, 18 తేదీలలో ఎక్కువ మంది భక్తులు వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేశామని అక్కడి అధికారులు స్పష్టం చేశారు. అయితే ఆయా తేదీలలో రూమ్స్ కోసం ముందుగానే బుక్ చేసుకుంటే సులభంగా దొరికే అవకాశం ఉంటుంది.

## ఛాతీనొప్పితో ఆస్పత్రిలో చేరిన నటుడు సాయజీ షిండే

ముంబై,ఏప్రిల్12: ప్రముఖ నటుడు సాయాజీ షిండే ఆస్పత్రిలో చేరారు. గురువారం ఛాతీలో నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు ఆయన్ను మహారాష్ట్రలోని సతారాలో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. పలు పరీక్షల అనంతరం గుండెలో కొన్ని బ్లాక్స్ ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. దీంతో యాంజియోప్లాస్టీ చేశారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని, త్వరలోనే డిశ్చార్జ్ చేస్తామని వైద్యులు తెలిపారు. సాయాజీ షిండే గత కొన్నిరోజులుగా అనారోగ్యంతో ఇబ్బందిపడుతున్నారు. రొటీన్ చెకప్‌లో భాగంగా మమ్మల్ని సంప్రదించారు. ఈసీజీలో స్వల్ప మార్పులు గుర్తించాం. దీంతో యాంజియోగ్రఫీ చేయించమని సూచించాం.

# సినిమా తీరు

## హాలీవుడ్ వెళ్లగానే బాలీవుడ్ చేదైందా..?

మనం చేసే పని ఏదైనా సరే ప్రమోషన్ కోసం ప్రాకులాడుతుంటాం. అది సినీ పరిశ్రమలో కూడా ఉంటుంది. మొదట కొందరు అవకాశం వస్తే చాలనుకుంటారు.. ఆ తర్వాత స్టార్ రేంజ్ కావాలని చూస్తారు. అది వచ్చాక వారి క్రేజ్ కు తగినట్టుగా డిమాండ్ చేయాలని భావిస్తారు. అది కూడా వస్తున్న టైం లో ఇక్కడ కాదు నెక్స్ట్ లెవెల్ ఇమేజ్ కోసం వేరే భాషకు వెళ్లాలని చూస్తారు. సౌత్ భామలందరు ఇక్కడ ఎంత స్టార్ డం వచ్చినా సరే బాలీవుడ్ ఛాన్స్ రావాలని అక్కడ రాణించాలని చూస్తుంటారు. అందుకే సౌత్ లో స్టార్ క్రేజ్ రాగానే చిన్నగా బాలీవుడ్ కి జంప్ అవుతుంటారు.అయితే బాలీవుడ్ భామలు మాత్రం అక్కడ స్టార్ క్రేజ్ తెచ్చుకుని హాలీవుడ్ కి ప్రమోట్ అవ్వాలని చూస్తారు. అయితే హాలీవుడ్ ఛాన్స్ అంటే అది అందరి వల్లా కాదు. కానీ బాలీవుడ్ స్టార్ హీరోయిన్స్ కొందరు అక్కడ కూడా సత్తా చాటుతున్నారు. అలాంటి వారిలో ప్రియాంక చోప్రా ఒకరు. బాలీవుడ్ స్టార్ హీరోయిన్ ప్రియాంకా చోప్రా హాలీవుడ్ లో క్వాంటికో వెబ్ సిరీస్ తో హాలీవుడ్ లోకి అడుగు పెట్టింది. ఆ సిరీస్ అక్కడ హిట్ అవ్వడంతో అక్కడ వరుస ఛాన్సులు అందుకుంది. హాలీవుడ్ లో దూసుకెళ్తున్న ప్రియాంకకు బాలీవుడ్ నుంచి ఆఫర్లు వచ్చినా సరే ఆమె నో చెప్పింది. తనకు స్టార్ డం తెచ్చిన బాలీవుడ్ ను కూడా ప్రియాంక లైట్ తీసుకుంది. ఈ క్రమంలో బాలీవుడ్ లో కొన్ని సినిమాలు కమిట్మెంట్ ఇచ్చి కూడా చివరి నిమిషం హ్యాండ్ ఇచ్చిన సందర్భాలు ఉన్నాయట. ఆ విషయాన్నే ప్రముఖ నిర్మాత బోనీ కపూర్ రీసెంట్ గా చెప్పుకొచ్చారు. బోనీ కపూర్ నిర్మాణంలో సర్దార్ నీ సినిమాకు ప్రియాంక సైన్ చేసిందట. దిల్జిత్ హీరోగా ప్రియాంక హీరోయిన్ గా ఆ సినిమా ప్లాన్ చేయగా ముందు ఓకే చెప్పిన ప్రియాంక ఆ తర్వాత కాదన్నది ఆమె నో చెప్పడంతో ఆ ప్రాజెక్ట్ ని పక్కన పెట్టాల్సి వచ్చిందని చెప్పుకొచ్చారు బోనీ కపూర్. క్వాంటికో సిరీస్ తర్వాత తనకు ఇచ్చిన కమిట్మెంట్ ప్రకారం సినిమా చేయాలని కాకపోతే ఆ టైం లో కొంత టైం కావాలని కోరిక ప్రియాంకకు అడిగినంత టైం ఇచ్చినా ఆమె నెక్స్ట్ క్వాంటికో 2 చేసింది కానీ తన సినిమా చేయలేదని అన్నారు బోనీ కపూర్. ప్రియాంక రాకపోవడంతో ఆ సినిమా ఆపేశానని చెప్పారు బోనీ కపూర్. అదే కాదు ఆ తర్వాత ప్రియాంక ఏ బాలీవుడ్ సినిమా చేయలేదు. హాలీవుడ్ లో తనకు ఏర్పడిన క్రేజ్ తో అక్కడే వరుస ప్రాజెక్ట్ లు చేస్తుంది అమ్మడు. బాలీవుడ్ నుంచి ఎంత పెద్ద ఆఫర్ వచ్చినా లైట్ తీసుకుంటుంది అమ్మడు. హాలీవుడ్ వెళ్లగానే తనకు ఇంత క్రేజ్ తెచ్చిన బాలీవుడ్ చేదైందా అంటూ ఆమెపై ఆడియన్స్ కామెంట్స్ చేస్తున్నారు.




## మహేష్ వదిలిన 'భజే వాయు వేగం'.. కార్తికేయ మళ్ళీ స్పీడులోనే..

టాలీవుడ్ హీరో కార్తికేయ గుమ్మకొండ కెరీర్ మొదట్లోనే ఒక సినిమాతో సాలిడ్ సక్సెస్ అందుకున్నాడు. ఇక తర్వాత అతను వెంట వెంటనే మరికొన్ని డిఫరెంట్ ప్రాజెక్టులతో తన అదృష్టాన్ని పరిక్షించుకున్నాడు. 2018 లో వచ్చిన ఆర్ఎక్స్ 100 బాక్సాఫీస్ వద్ద ఊహించని స్థాయిలో లాభాలు అందించింది. ఇక తర్వాత ఏడాది అతను ఒకేసారి నాలుగు సినిమాలతో వచ్చాడు.ఇక ఆ తర్వాత చావు కబురు చల్లగా రాజా విక్రమార్క లాంటి సినిమాలు చేశాడు. ఇక నాని గ్యాంగ్ లీడర్ - వాలిమై లాంటి సినిమాల్లో కార్తికేయ విలన్ గా కనిపించి తనలోనే సరికొత్త నటుడిని బయటపెట్టే ప్రయత్నం అయితే చేశాడు. ఇక చివరిగా అయితే బెదురులంక అనే సినిమాతో వచ్చాడు. ఇక నెక్స్ట్ అతను భజే వాయు వేగం అనే సినిమాతో రాబోతున్నాడు. ంశ్రీబనీ ఖీవజీట - హాలీవుడ్ వెళ్లగానే బాలీవుడ్ చేదైందా..? టాలీవుడ్ టాప్ ప్రొడక్షన్స్ లో ఒకటైన జిం క్రియేషన్స్ సపోర్టుతో రాబోతున్న ఈ సినిమాను కొత్త దర్శకుడు ప్రశాంత్ రెడ్డి డైరెక్టర్ చేస్తున్నాడు. ఇక సినిమాకు సంబంధించిన రెగ్యులర్ అప్డేట్స్ తో పాజిటివ్ వైబ్రేషన్స్ క్రియేట్ చేయాలి అని మేకర్ సిద్ధమయ్యారు. సినిమాకు సంబంధించిన మోషన్ టీజర్ ను కొద్దిసేపటి క్రితం విడుదల చేశారు. టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబు ఈ సినిమా ఫస్ట్ లుక్ ని లాంచ్ చేయడం విశేషం. భజే వాయు వేగం టైటిల్ ఫస్ట్ లుక్ చాలా బాగుందని చెప్పిన మహేష్ హీరో కార్తికేయకు అలాగే డైరెక్టర్ ప్రశాంత్ రెడ్డికి, చిత్ర యూనిట్ సభ్యులకు సినిమా మంచి విజయాన్ని అందించాలని సోషల్ మీడియాలో వివరణ ఇచ్చారు. దీంతో ఈ సినిమా పోస్టర్ మరింత వైరల్ గా మారింది. సీజీ వర్క్ కాన్సెప్ట్ తో ఉన్న ఆ టీజర్ లో హీరో కారులో వేగంగా వెళుతున్నట్లు చూపించారు. టైటిల్ కు తగ్గట్టుగా అయితే స్పీడ్ ని హైలైట్ చేశారు. ఇక ఇదివరకే కార్తికేయ ఈ తరహా రేసింగ్ కనెక్షన్ ఉన్న క్యారెక్టర్లు చేశాడు. నాని గ్యాంగ్ లీడర్ సినిమాలో స్పోర్ట్స్ రేసర్ గా కనిపించిన అతను ఆ తర్వాత వాలి మై సినిమాల్లో కూడా చేసింగ్ యాక్షన్స్ సీక్వెన్స్ లో కూడా మరింత హైలెట్ అయ్యాడు. ఇక చావు కబురు చల్లగా సినిమాలో మార్చురీ డ్రైవర్ గా కూడా అతను డిఫరెంట్ క్యారెక్టర్ చేశాడు. ఇక ఇప్పుడు భజే వాయు వేగం సినిమాలో కూడా చాలా వేగంగా దూసుకుపోయే క్యారెక్టర్ తో హైలెట్ కాబోతున్నట్లు తెలుస్తోంది. ఇక పోస్టర్ లో క్రికెట్ బ్యాట్ తో పట్టుకుని ఉండగా అతని చుట్టూ నోట్ల కట్టలు ఎగురుతున్నట్లు కనిపిస్తోంది. చూస్తుంటే ఈ సినిమాలో విభిన్న అంశాలు హైలెట్ కాబోతున్నట్లుగా తెలుస్తోంది. ఇక ఈసారి తప్పనిసరిగా కార్తికేయ బాక్సాఫీస్ వద్ద ఒక సక్సెస్ అయితే అందుకోవాల్సిన అవసరం ఉంది. మరి ఈ సినిమా ఎలాంటి ఫలితాన్ని అనుకుంటుందో చూడాలి.



## ఐరన్ సప్లిమెంట్ గర్భవతి కంటే కడుపులో పెరిగే బిడ్డకు చాలా అసవరం?ఎందుకంటే..



మహిళలు గర్భం పొందితన తర్వాత ఆరోగ్య పరంగా ఎన్నో అవాంతరాలను ఎదుర్కోవల్సి వస్తుంది. వాస్తవంగా చెప్పాలంటే గర్భధారణ తరచుగా కారణమని చాలా మందికి తెలియదు. గర్భధారణ సమయంలో గర్భిణి యొక్క ఆరోగ్యం చాలా ముఖ్యమైనది. అయితే అనేక కారణాల వల్ల అది జరగకపోవచ్చు. అందులో ఒకటి ఆహారం. గర్భం పొందితన తర్వాత గర్భిణీ తీసుకునే ఆహారం విషయానికి వస్తే గర్భిణీ తీసుకునే ఆహారం తరచూ కడుపులో పెరుగుతున్న పిండం మీద తీవ్ర ప్రభావం చూపుతుందిఆరోగ్య సంరక్షణ విషయానికి వస్తే తరచుగా రకరకాల అవాంతరాలు ఎదురవుతాయి. ఇవన్నీ తొలగించడానికి మనం గమనించాల్సిన కొన్ని విషయాలు ఉన్నాయి. వీటిలో ముఖ్యమైనవి తరచుగా గర్భధారణ రుగ్మతలు. గర్భధారణ సమయంలో మహిళల అసౌకర్యానికి కారణం ఐరన్ లోపం. కొంత మంది గర్భిణీ స్త్రీలు ఐరన్ లోపం వల్ల మూడు నాలుగు నెల నుండే ఐరన్ సప్లిమెంట్స్ తీసుకుంటుంటారు. గర్భధారణ సమయంలో ఐరన్ తినడానికి కారణమేమిటో చూద్దాం. గర్భిణీ స్త్రీలకు ఐరన్ తప్పనిసరిగా కలిగి ఉండటానికి అసలైన కారణాలేంటో ఇక్కడ చూడండి...శిశువు సరైన పెరుగుదలశిశువు సరైన పెరుగుదలశిశువు యొక్క సరైన పెరుగుదలకు ఇనుము చాలా అవసరం. ముఖ్యంగా రెండవ మూడవ త్రైమాసంలో సమస్యలు లేకుండా ఆరోగ్యంగా పెరగడానికి ఇది తప్పనిసరి. కాబట్టి ప్రతి వారం శిశువు పెరుగుదలకు ఐరన్ స్థాయిలను పెంచుకోవడం చాలా ముఖ్యమైనవి. అందువల్ల, ఐరన్ సప్లిమెంట్ లేదా ఐరన్ కలిగిన ఆహారాన్ని అటువంటి పరిస్థితులలో తప్పనిసరిగా తీసుకోవాలి.ఐరన్ పుష్కలంగా ఉండే ఆహారాలుఐరన్ పుష్కలంగా ఉండే ఆహారాలర్భిణీలు ఐరన్ సరిపడినంతా లేకపోతే అది అనీమియాకు దారితీస్తుంది. దాంతో అనేక ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటారు. ఈ పరిస్థితి రాకుండా ఉండాలంటే మీ రోజువారి ఆహారాల్లో మాంసం, చికెన్, గుడ్లు, ఆకుకూరలు, టోఫు ఎక్కువగా తీసుకోవాలి. వీటితో పాటు ఐరన్ టాబ్లెట్స్ కూడా తీసుకోవచ్చు.గర్భధారణలో ఆటంకాలుగర్భధారణలో ఆటంకాలుగర్భధారణ సమయంలో మీరు వివిధ రకాల అసౌకర్యాన్ని అనుభవించవచ్చు. ఐరన్ అత్యంత ప్రభావవంతమైన రోగ నిరోధక శక్తిగా పనిచేస్తుంది మరియు రోగనిధకను పెంచే వాటిలో ఐరన్ ఒకటి. కాబట్టి మీ డాక్టర్ సూచించినట్లు ఐరన్ కలిగిన ఆహారాలు మరియు మాత్రలను తప్పకుండా తీసుకోండి.గుర్తుంచుకోవల్సిన విషయంగుర్తుంచుకోవల్సిన విషయంఐరన్ కలిగిన ఆహారాన్ని తినేటప్పుడు కొన్ని విషయాలు పరిగణనలోకి తీసుకోవాలి.




వీటిలో ముఖ్యమైనది ఐరన్ ఫుడ్స్ తినేటప్పుడు కెఫిన్(కాఫీ,టీ మరియు నికోటిన్)లను పూర్తిగా నివారించడం ఉత్తమం.

## బుట్ట బొమ్మకి మళ్లీ హ్యాండ్ ఇచ్చారా..?

నిన్న మొన్నటిదాకా సూపర్ ఫాం లో ఉన్న హీరోయిన్ సడెన్ గా ఒక్క ఆఫర్ కూడా లేక కెరీర్ డైలమాలో పడేలా చేసుకుంది. స్టార్ హీరోల సరసన ఫస్ట్ ఆప్షన్ తనే అనిపించుకున్న అమ్మడు కాస్త స్టార్ ఛాన్స్ కాదు కనీసం ఏ అవకాశం కూడా ఇవ్వలేనంతగా దూరమైంది. మొన్నటిదాకా చేతి నిండా సినిమాలతో అదరగొట్టిన అమ్మడు కాస్త ఇప్పుడు చేతిలో సినిమా లేక ఖాళీ అయ్యింది. లేటెస్ట్ గా ఒక సినిమా డిస్కషన్ స్టేజ్ లో ఉందని అనుకుంటుండగా ఇప్పుడు ఆ ఛాన్స్ కూడా వేరే హీరోయిన్ కు దక్కిందని తెలుస్తుంది. ఫ్లవర్ కంటే సుకుమారంగా.. టాలీవుడ్ లో అన్ లక్కీ టైం కొనసాగిస్తున్న హీరోయిన్ గా బుట్ట బొమ్మ పేరు వినిపిస్తుంది. దువ్వాడ జగన్నాథం ముందు రెండు సినిమాలు చేసినా అమ్మడు వాటితో సక్సెస్ అందుకోలేదు. డీజేతో అమ్మడు ఆడియన్స్ మనసులు గెలిచింది. ఇక అప్పటి నుంచి వరుస స్టార్ సినిమాలతో దూసుకెళ్లింది. యాక్టింగ్ పరంగా సోసోగానే అనిపించినా గ్లామర్ షోలో ఫస్ట్ క్లాస్ మార్కులు కొట్టేసిన పూజా హెగ్దే టాలీవుడ్ లో టాప్ ప్లేస్ దక్కించుకుంది. అయితే సడెన్ గా వరుస ఫ్లాపులు ఆమె గ్రాఫ్ పడిపోయేలా చేసింది. సినిమాలు ఆడకపోవడంతో ఆమెకు ఛాన్సులు కూడా కరువయ్యాయి. మహేష్ గుంటూరు కారం నుంచి తప్పుకోవడం ఆమెను మరింత రిస్క్ లో పడేసింది. అయితే న్యాచురల్ స్టార్ నాని హీరోగా సుజిత్ డైరెక్షన్ లో చేయబోయే సినిమాలో పూజా హెగ్దే నటిస్తుందని టాక్ వినిపించింది. అయితే పూజాని అనుకున్నారో లేదో కానీ ఇప్పుడు ఆమె ప్లేస్ లో మిస్టర్ బచ్చన్ హీరోయిన్ భాగ్య శ్రీ బోర్స్ ని హీరోయిన్ గా ఫిక్స్ చేస్తున్నారట. పూజా హెగ్దే దాదాపు ఫిక్స్ అనుకుంటున్న ఈ ఒక్క ఆఫర్ కూడా ఆమె చేతి నుంచి జారిపోయింది. సో టాలీవుడ్ లో పూజా బ్యాడ్ టైం ఇంకా కొనసాగుతూనే ఉంది. రవితేజ, నాని ఇలా టైర్ 2 హీరోల సినిమాల్లో పూజాని తీసుకునేందుకు ఆసక్తి చూపించట్లేదు. అందుకే బాలీవుడ్ వైపే ఆఫర్ల కోసం ప్రయత్నాలు చేస్తుంది పూజా హెగ్దే. నాగ చైతన్య హీరోగా చేస్తున్న నెక్స్ట్ సినిమాలో పూజా బేబికి ఛాన్స్ ఇస్తున్నారని టాక్ నడుస్తుంది. చైతు సినిమా ఒక లైలా కోసం సినిమాతోనే తెలుగు తెరకు పరిచయమైన పూజా హెగ్దే ఈ టఫ్ టైం లో మళ్లీ రెండోసారి కూడా చైతన్య సినిమా తోనే రాబోతుంది. మరి ఈ ఛాన్స్ అమ్మడికి మరిన్ని అవకాశాలు వచ్చేలా చేస్తుందా లేదా అన్నది చూడాలి.



### అందానికే మరో అందం....




## అల్లు అర్జున్.. పుష్ప తరువాత ఒకేసారి రెండు!

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ పుష్ప సినిమాను వీలైనంత త్వరగా పూర్తి చేయాలి అని నాన్ స్టాప్ గా షూటింగ్లో అయితే పాల్గొంటున్నాడు. ఇక సుకుమార్ కూడా అదే స్పీడ్ లో కంటెంట్ పర్ఫెక్ట్ గా వచ్చేలా తన పని తాను చేసుకుంటూ వెళుతున్నాడు. సినిమాను ఆగస్టు 15 రిలీజ్ చేస్తామని మేకర్స్ ఇదివరకే చాలాసార్లు క్లారిటీ ఇచ్చింది. కొన్నిసార్లు ఈ విషయంలో రకరకాల గాసిప్స్ ఫ్యాన్స్ లో కంగారును కలిగించినప్పటికీ అందులో ఎలాంటి టెన్షన్ అవసరం లేదు అని ఎప్పటికప్పుడు రిలీజ్ డేట్ పై క్లారిటీ ఇస్తూనే ఉన్నారు. ఇక పుష్ప 2 తర్వాత అల్లు అర్జున్ తదుపరి సినిమాను ఏ దర్శకుడితో వెంటనే మొదలుపెడతాడు అనేది కాస్త సస్పెన్స్ ని క్రియేట్ చేస్తోంది. ఇదివరకైతే త్రివిక్రమ్ తో నెక్స్ట్ సినిమా దాదాపు ఫిక్స్ అయినట్లే అని హారిక హాసిని గీతా ఆర్ట్స్ కాంబినేషన్ లోనే అల్లు అర్జున్ మరో సినిమాను త్వరగానే మొదలుపెట్టే అవకాశం ఉన్నట్లుగా కథనాలు వెలువడ్డాయి. ఇక ఊహించిన విధంగా లిస్టులోకి తమిళ దర్శకుడు అట్లీ పేరు రావడంతో మళ్లీ బన్నీ లైనప్ లో మార్పులు వచ్చాయి. ఇక ముందుగా అట్లి ప్రాజెక్టును సన్ పిక్చర్స్ లో మొదలుపెట్టి అవకాశం ఉన్నట్లుగా తెలుస్తోంది. ఈ ప్రాజెక్టుకు అల్లు అరవింద్ కూడా సహనిర్మాతగా ఉండే అవకాశం ఉంది. ఇక మరోవైపు త్రివిక్రమ్ కూడా బన్నీ కోసం ఒక కథను సిద్ధం చేసి ఉంచాడు. ఇక అన్ని అనుకున్నట్లు జరిగితే అట్లీ ప్రాజెక్ట్ మొదలుపెట్టిన ఒక రెండు మూడు నెలల తర్వాత త్రివిక్రమ్ సినిమాను కూడా పట్టాలు ఎక్కించే అవకాశం ఉంది. ఇక వచ్చే ఏడాది సమ్మర్ లో అట్లీ సినిమాను పూర్తిచేసే ఆ తర్వాత అదేఏ ఏడాది అక్టోబర్ నాటికి త్రివిక్రమ్ సినిమాను కూడా సిద్ధం చేసే ఆలోచనలో ఉన్నారు. అన్ని అనుకున్నట్లు కుదిరితే ఈ రెండు సినిమాలు కూడా వచ్చే ఏడాదిలో ప్రేక్షకుల ముందుకు తీసుకురావచ్చు. కానీ అల్లు అర్జున్ అంత స్పీడ్ గా రెండు సినిమాలను ఫినిష్ చేస్తాడా లేదా అనేది అసలు ప్రశ్న. ప్రస్తుతం పుష్ప సినిమాతో ఎలాగైనా బాక్స్ ఆఫీస్ వద్ద గ్రాండ్ సక్సెస్ అందుకోవాలని చూస్తున్నాడు. దాదాపు 1000 కోట్లు టార్గెట్ అయితే ఫిక్స్ చేసుకున్నారు. ఆ దిశగా సినిమా ప్రమోషన్స్ కూడా చేయబోతున్నారు. ఇక దర్శకుడు అట్లీ ఇదివరకే జవాన్ సినిమాతో వెయ్యి కోట్ల బాక్సాఫీస్ సక్సెస్ అందుకున్నాడు కాబట్టి బన్నీతో చేయబోయే సినిమా కూడా హై రేంజ్ లో ఉంటుంది అని చెప్పవచ్చు. మరి త్రివిక్రమ్ ప్రాజెక్టు ఎలాంటి హైప్ క్రియేట్ చేస్తుందో చూడాలి.



## అప్పటి వరకు కెప్టెన్ రోహిత్ శర్మనే!

టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ ప్రస్తుతం ఐపీఎల్-2024తో బిజీగా ఉన్నాడు. ముంబై ఇండియన్స్ సారథిగా తనను తప్పించడంతో బ్యాటింగ్‌పైన దృష్టి పెట్టిన హిట్‌మ్యాన్...వరల్డ్‌కప్ నాటికి పూర్తి ఫామ్‌లోకి రావాలని పట్టుదలగా ఉన్నాడు.ఇప్పటి వరకు ఈ సీజన్‌లో ఆడిన ఐదు మ్యాచ్‌లలో కలిపి 156 పరుగులు చేశాడు హిట్‌మ్యాన్. తాజాగా ఆర్సీబీతో గురువారం నాటి మ్యాచ్‌లో తనదైన షాట్లతో అలరించి ముంబై విజయంలో తానూ భాగమయ్యాడు.ఇదిలా ఉంటే..36 రోహిత్ శర్మకు వయసు పైబడుతున్న దృష్ట్యాఅతడిని టీమిండియా సారథిగానూ తప్పించాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే పరిమిత ఓవర్ల కెప్టెన్‌గా ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా పేరు బలంగా వినిపిస్తుండగా.. టెస్టులకు పేస్ దళ నాయకుడు జస్‌ప్రీత్ బుమ్రాకు కెప్టెన్‌ను చేస్తే బాగుంటుందని విశ్లేషకులు అంటున్నారు.అయితే, బీసీసీఐ మాత్రం టీ20 ప్రపంచకప్-2024లోనూ రోహిత్ శర్మనే టీమిండియాను ముందుకు నడిపిస్తాడని స్పష్టం చేయడం గమనార్హం. ఈ నేపథ్యంలో రిటైర్మెంట్‌పై రోహిత్ శర్మ చేసిన వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి."ఇప్పటి వరకు నేను రిటైర్మెంట్ గురించి అసలు ఆలోచించనేలేదు. అయితే, జీవితం ఎప్పుడు ఎలాంటి మలుపులు తీసుకుంటుందో చెప్పలేం కదా! ఇప్పటికీ నేను బాగానే ఆడుతున్నాను.మరికొన్నేళ్ల పాటు ఆడగలననే అనుకుంటున్నా. ఆ తర్వాత ఏం జరుగుతుందో చూద్దాం. వరల్డ్‌కప్ గెలవాలనుకుంటున్నాను. ఇంకా వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ 2025 ఫైనల్ కూడా ముందు ఉంది.టీమిండియా గెలుస్తుందనే అనుకుంటున్నా" అని ఇప్పట్లో తనకు రిటైర్ అయ్యే ఆలోచన లేదని రోహిత్ శర్మ స్పష్టం చేశాడు. బ్రేక్‌ఫాస్ట్ విత్ చాంపియన్స్ షోలో ఈ మేరకు వ్యాఖ్యలు చేశాడు. కాగా జూన్ 1 నుంచి అమెరికా- వెస్టిండీస్ వేదికగా టీ20 ప్రపంచకప్-2024 ఆరంభం కానుంది.ఈ క్రమంలో జూన్ 5 ఐర్లాండ్‌తో మ్యాచ్‌తో టీమిండియా ఈ మెగా టోర్నీలో తన ప్రయాణం ఆరంభించనుంది. ఇక రోహిత్ శర్మ సారథ్యంలో ఇప్పటికే టీ20 ప్రపంచకప్-2022, వన్డే వరల్డ్‌కప్-2023 ఆడిన భారత జట్టు ఒక్క ఈవెంట్‌లోనూ చాంపియన్‌గా నిలవలేకపోయింది. కాగా రోహిత్ శర్మ తాజా వ్యాఖ్యల నేపథ్యంలో అభిమానులు ఖుషీ అవుతున్నారు. 2027 వరల్డ్‌కప్ వరకు కూడా హిట్‌మ్యానే కెప్టెన్‌గా ఉంటాడంటూ కామెంట్లు చేస్తున్నారు.



## సెంచరీ పూర్తి చేసిన ఇషాన్ కిషన్

ఐపీఎల్ 2024లో భాగంగా ఆర్సీబీతో నిన్న (ఏప్రిల్ 11) జరిగిన మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్ ఓపెనర్ ఇషాన్ కిషన్ అరుదైన మైలురాయిని తాకాడు. ఈ మ్యాచ్‌లో 5 సిక్సర్లు బాదిన ఇషాన్ ఐపీఎల్‌లో సిక్సర్ల సెంచరీని పూర్తి చేశాడు.తద్వారా ముంబై ఇండియన్స్ తరఫున ఈ ఘనత సాధించిన నాలుగో క్రికెటర్‌గా రికార్డుల్లోకెక్కాడు. ఇషాన్‌కు ముందు రోహిత్ శర్మ, కీరన్ పోలార్డ్, హార్దిక్ పాండ్యా ముంబై ఇండియన్స్ తరఫున 100 సిక్సర్ల మార్కును తాకారు. ఇషాన్ ఖాతాలో ప్రస్తుతం 102 సిక్సర్లు (80 మ్యాచ్‌లు) ముంబై ఇండియన్స్ 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది.తొలుత బ్యాటింగ్ చేసిన ఆర్సీబీ.. డుప్లెసిస్ (40 బంతుల్లో 61; 4 ఫోర్లు, 3 సిక్సర్లు), రజత్ పాటిదార్ (26 బంతుల్లో 50; 3 ఫోర్లు, 4 సిక్సర్లు), దినేశ్ కార్తీక్ (53 నాటౌట్) రాణించడంతో నిర్ణీత ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 196 పరుగులు చేసింది.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY BYAGAL SRINIVAS, PRINTED AT S.S. PRINTERS & FILE MAKERS, PUS ALAGALLY, JAWAHAR ROAD, Town & Dist.NIZAMABAD- 503001, TELANGANA STATE, PUBLISHED AT H.NO: 6-11-174/1, NAMDEVWADA, Town & Dist. NIZAMABAD, TELANGANA STATE - 503001.EDITOR: BYAGAL SRINIVAS.